ANDHRA JYOTI, VIJAYAWADA Regd No H. 543

ఉదయం ★★★ Telephones : 74212, 74343

ఆంధ్రజ్యోతి

ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు

122618

సూర్యగోళంలో పెద్ద ప్రేలుడు

బౌల్డర్, (కోలారాడో) ఆగస్టు 8— భారత కాలమానం ప్రకారం నిన్న రాత్రి 10—30 గంటలకు సూర్యగోళంలో పెద్ద ప్రేలుడు సంభవించినట్టు అమెరికా వాతావరణ పరిశోధన సంస్థకు చెందిన రోదసి శాస్త్రవేత్త తెలియజేశారు. క్రిందటి శనివారంనాడు కూడా సూర్యగోళంలో ఒక ప్రేలుడుజరిగి, భూ మండలాన్ని అయస్కాంతపు తుపానుతో ముంచివేసిందని,అయితే ఈ సారి జరిగిన ప్రేలుడు దానికంటె చాల పెద్దదని ఆయన చెప్పారు. కొత్త ప్రేలుడు సూర్యుని ఉపరితలంమీద 28,000 లక్షల చదరపు మైళ్ళ విస్తీర్ణంలోనిది, దాని వల్ల జనించిన కొన్ని కిరణాలు భూమండలానికి ఒక గంటలోనే చేరుకొన్నవని శ్రీ రాబర్ట్ డెకర్ చెప్పారు.

కనబడుటలేదు

బాబూ నాగేశ్వరరావూ ! మీ అమ్మ, నాన్న బెంగతో మంచం పట్టినారు. మన కుటుంభమంతా దుఃఖపయములోనే వున్నాము. వెంటనే నీవెచ్చట వున్నా మన ఇంటికిగానీ, నాదగ్గరకైనా గానీ రమ్ము. నిన్ను ఎవ్వరమూ ఏమీఅనము.

గోవాడ నాగేశ్వరరావు వయస్సు 17 సం॥ చామనచాయ, ఎత్తు 5 అడుగులు. కోలమొఖము. ముఖముపై కొద్దిగా స్పాటకపు మచ్చలు కనబడును. 23—5—72 సండి ఇల్లు విడిచివెళ్ళాడు. అచూకీ తెల్పినవారికి రు. 116 లు బహుమతి ఇచ్చి వంపెదము.

జి. నాగేశ్వరరావు (చిన్నాన్న), గోవాడ చలపతిరావు, బయ్యారం, ఇల్లెందు తాలూకా, ఖమ్మం జిల్లా.

సంపుటి 13 : : సంచిక 40 | విజయవాడ, ఆగస్టు 9, 1972 బుధవారం | 6 పేజీలు : : 18 పైసలు (Inclusive of Excise Duty)

రాష్ట్రంలో దుర్భిక్షం నివారణకు కేంద్రం బృహత్ సహాయం

19 జిల్లాలలో అసాధారణ పరిస్థితి దృష్ట్యా కేంద్రమంత్రి శ్రీ షిండే హామీ

ఆంధ్రజ్యోతి

ఆంధ్రప్రదేశ్ అగ్నిబాధితుల సహాయనిధి

ఆపన్నుల కిచ్చే ప్రతి రూపాయి
అమోఘమైన ఒక పూజా పుష్పం
అగ్నిబాధితులను మించి
నేడు ఆపన్నులెవరు ?

మీ విరాళాలను వెంటనే పంపండి

'యుద్ధ ప్రాతిపదికపై విస్తృత పథకం'

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాదు, ఆగస్టు 8—

ప్రస్తుతం అనావృష్టి పరిస్థితిని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు "చెప్పుకోదగినంత సహాయం" అందించడానికి హామీ పడినదని కేంద్ర ఆహారశాఖ సహాయ మంత్రి శ్రీ ఎ. పి. షిండే నేడిక్కడ ప్రకటించారు.

శ్రీ షిండే నేటి ఉదయం ఇక్కడికి చేరుకున్నారు. ఈయన ముఖ్యమంత్రితోను, ఇతర రాష్ట్ర ప్రభుత్వం అధికారులతోను రాష్ట్రంలో దుర్భిక్షపరిస్థితి గురించి, సత్వరం తీసుకోదగు చర్యల గురించి చర్చించారు.

చర్చల అనంతరం శ్రీ షిండే పత్రికల వారితో మాట్లాడుతూ, యుద్ధ ప్రాతిపదికపై కార్యక్రమం సిద్ధం చేయవలసిందిగా తాను ముఖ్యమంత్రిని కోరానని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టే పథకం ఎంత పెద్దదైనప్పటికీ, అందుకు తగు సహాయం కేంద్రం అందించగలదని కూడా శ్రీ షిండే పేర్కొన్నారు.

ఖరీఫ్ పంటరక్షణకు, రాబీపంట విస్తృతంగా తీయడానికి కేంద్రం బృహత్ పథకం రూపొందించాలని వాంఛిస్తున్నదని శ్రీ షిండే అన్నారు.

ఆంధ్రలో అధిక రాలుబడి వంగడాల వైఫల్యం

ఇతరచోట్ల ఫలించినట్టుగా ఆంధ్రప్రదేశ్‌లో అధికారాలుబడినిచ్చే విత్తనాలవల్ల ఉపయోగం లేకపోయినదని, అందువల్ల రాబీ పైరుసాగును నెల, నెలన్నరమందుగా సాగించవలసివుంటుందని సూచించడం జరిగినదని శ్రీ షిండే చెప్పారు.

ఈ ఏడాది ఈ పద్ధతిని రాష్ట్రంలో బృహత్ స్థాయిలో అనుసరిస్తారని ఆయన అన్నారు.

ఆహార సరఫరాల గురించి ప్రస్తావిస్తూ శ్రీ షిండే ప్రజలలో సరకు పంపిణీ వ్యవస్థను పటిష్టం చేయాలని, రానున్న మాసాలలో బియ్యం సప్లయిని పెంచగలమని, అవసరమైన వర్గాల ప్రయోజనాల పట్ల రాష్ట్రప్రభుత్వం జాగరూకతతో వ్యవహరించాలని శ్రీ షిండే అన్నారు.

ప్రతినెలా కేంద్రం బియ్యం, గోధుమ కోటాలు మంజూరు చేయగలదని అన్నారు.

పిండి, రవ్వ పంపిణీ

అలాగే పిండి మిల్లులనుంచి వచ్చే గోధుమ, మైదా వగైరా పిండి, రవ్వకూడా ప్రజాపంపిణీ పద్ధతిపైనే కంట్రోల్‌లో వుంచుకుంటూ, పంపిణీ చేయాలని కూడా కేంద్రం నిర్ణయించినది. ఈ విషయంకూడా ముఖ్యమంత్రికి శ్రీ షిండే తెలిపారు.

ప్రస్తుత పద్ధతిప్రకారం, పిండిమిల్లులకు ఏటా కంట్రోల్‌రకపు 25 లక్షల టన్నులు కేటాయించడం జరిగింది.

అతిథుల సంఖ్యపై పరిమితి

రాష్ట్ర ప్రభుత్వం "అతిథుల సంఖ్య పరిమితి" ఉత్తరువును ఖచ్చితంగా పాటించాలని, అత్యవసర సరకుల చట్టం నిబంధనలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కూడా సూచించడం జరిగింది.

రాష్ట్ర పర్యటనలో తన ప్రధాన ఉద్దేశం అనావృష్టి పరిస్థితి గురించి, ఆహార పరిస్థితి గురించి సమీక్షించుకోవడమని శ్రీ షిండే చెప్పారు.

తాను వస్తూ విమానంనుంచి చూశానని, పరిస్థితి అసాధారణంగా వున్నదని, దాదాపు చెరువులన్నీ ఎండిపోయినవని, పంటలు దెబ్బతిన్నవని, ఆగస్టు నెలలో ఈ పరిస్థితి అసాధారణమని శ్రీ షిండే అన్నారు.

ఇప్పటికి రాష్ట్రంలో 60 శాతం సాగు భూమిలోమాత్రమే నాట్లువడినవని, 21 జిల్లాలలో 19 జిల్లాలు అనావృష్టికి గురైనవని తనకు ముఖ్యమంత్రి చెప్పినట్టు శ్రీ షిండే పేర్కొన్నారు.

జొన్న, చేరుశెనగ పంటలుకూడా బాగా దెబ్బతినిపోయినవని శ్రీ షిండే చెప్పారు.

దుర్భిక్షం సమస్యను జాతీయస్థాయిలో పరిష్కరించడానికి ప్రయత్నం జరుగుతున్నదని, ఆహార ధాన్యాల దిగుమతులు లేకుండానే సంక్షోభం కలదని గట్టెక్కగల మన్న ఆశ వున్నదని శ్రీ షిండే పేర్కొన్నారు.

దేశంలోని ఆహార ధాన్యాల ఉత్పత్తిలో 35 శాతం రాబీ పంట ఖరీఫ్ 65 శాతం వున్నప్పటికి రాబీ పంట నమ్మశక్యమైన పంట అని అనుభవంవల్ల ఋజువైనదని శ్రీ షిండే అన్నారు. ఖరీఫ్ గురైనన్ని ప్రకృతి ఆటుపోట్లకు రాబీ గురికాదు. అందువల్లనే, ఖరీఫ్—రాబీపంటల నిష్పత్తిని 50 : 50 (సగం సగం)కి క్రమంగా మార్చాలని నిర్ణయించడం జరిగినదని శ్రీ షిండే తెలిపారు.

ఈ వైపుగా కేంద్ర ప్రభుత్వం బృహత్ కార్యక్రమం చేపట్టనున్నదని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ అయితే ఇప్పటినుంచే ఈ కార్యక్రమం చేపట్టడం సాధ్యమని ఆయన అన్నారు.

జొన్న పంట వ్యందే ప్రాంతాన్ని పెంచాలని కూడా సూచించడం జరిగినదని, ఇందుకు వివరాలు రూపొందుతున్నవని అన్నారు.

కేంద్రం హామీ

ప్రస్తుతపు ఖరీఫ్‌పంట రక్షణకు, వచ్చే రాబీపంటలకు భవిష్యత్తులోకూడా సంపూర్ణ సహాయం కేంద్రం అందించగలదని శ్రీ షిండే హామీఇచ్చారు.

బృహత్ ప్రాతిపదికపై, యుద్ధప్రాతిపదికపై కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టనున్నదని ఆయన చెప్పారు.

అహారపరిస్థితి గురించి ఆందోళన అనవసరమని శ్రీ షిండే అన్నారు.

జులై నెల ప్రారంభంనాటికి కేంద్రం వద్ద 95 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు నిల్వవున్నవని, రాష్ట్రాల పూర్తి అవసరాలు తీర్చడానికి కేంద్రం సిద్ధంగా వున్నదని ఆయన అన్నారు.

శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ ప్రకటన

న్యూఢిల్లీ, ఆగస్టు 8— దేశంలో కొన్ని ప్రాంతాలలో దుర్భిక్ష పరిస్థితి వున్నప్పటికి, ఆహార పరిస్థితి విషయంలో ఆందోళన చెందవలసిన అవసరంలేదని వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ నేడు కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ కార్యవర్గానికి హామీనిచ్చారు.

దేశంలో తగినన్ని ఆహార నిల్వలు కలవని, అంతేకాకుండా ఆహారోత్పత్తి పెరుగుదలకు ప్రభుత్వం పెక్కు చర్యలు గైకొంటున్నదని ఆయన అన్నారు.

రాజస్థాన్‌లో తప్ప మిగిలిన దేశంలో వర్షాలు పడుతున్నవని ఆయన చెప్పారు.

ఈ ఏడాది ఖరీఫ్ పంటలో 150 లక్షల టన్నుల మేరకు పంట తగ్గగలదని అంచనా వల్ల తెలుస్తున్నదని ఆయన అన్నారు. సాగులో లేని భూమిని సాగులోకి తీసుకొని రావడానికి చర్యలు గైకొంటున్నట్టు ఆయన చెప్పారు.

లోకం తీరు

"తామ్రపత్రం ఇస్తే తీసుకోండిగాని, స్వాతంత్ర్య యోధుల పెన్షన్ కూడా ఇవ్వమని అడగండి !"

శ్రీమతి గాంధికి దేవునిపై భక్తి

బొంబాయి, ఆగస్టు 8— ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధికి దేవునిపై విశ్వాసం వుందిగాని, జ్యోతిష్యంపై విశ్వాసం లేదు.

ఇలస్ట్రేటెడ్ వీక్లీ పత్రిక ప్రత్యేక సంచికకు శ్రీ కుష్వంత్ సింగ్ ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రీమతి గాంధి "అవును, నాకు దేవునిపై విశ్వాసం వుంది. కాని గడ్డాలు పెంచుకొని దేవుళ్ళ మాదిరిగా కూర్చునేవారిపై కాదు."

"మీ ఎదురుగావున్న వారిపైనా?" నవ్వుతూ, "నేను వ్యక్తిగతంగా చెప్పడంలేదు. వేదాంతంపట్ల నాకు విశ్వాసం వుంది."

"మీకుజ్యోతిష్యంమీద విశ్వాసం వుందా?

"లేదు" అని ఆమె గట్టిగా చెప్పారు. దానిపై ఆధారపడి ఎవరూ పనిచేయరని భావిస్తాను కాని, అది ప్రజలకు సంతోషం కలిగిస్తే, వారికి అడ్డురాను."

తాజావార్త

జార్జిటౌన్, ఆగస్టు 8— అలీన దేశాల విదేశాంగ మంత్రుల సమావేశానికి గయానా ప్రధాని ఫోర్బెస్ బర్న్‌హామ్ నేడిక్కడ ప్రారంభోత్సవం చేశారు.

64 దేశాల ప్రతినిధులు ఈ ప్రారంభోత్సవ ప్రసంగ హాజరయ్యారు.

1974 నాటికి దేశంలో 30 లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి కొరత

—లోకసభలో మంత్రి హెచ్చరిక

న్యూఢిల్లీ, ఆగస్టు 8—

దేశం 1973-74 వ సంవత్సరంలో ఇరవై మొదలుకొని ముప్పయి లక్షల కిలోవాట్ల వరకు విద్యుచ్ఛక్తి కొరతను ఎదుర్కొనవలసి రాగలదని నేడు ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి శాఖ మంత్రి డాక్టర్ కె. ఎల్. రావు హెచ్చరించారు.

లోకసభ ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి ఈ విషయాన్ని తెలియజేస్తూ, కేరళలో ఇడిక్కి, తమిళనాడులో కల్పక్కం భారీ ప్రాజెక్టులు పూర్తిఅయిన పక్షంలో విద్యుచ్ఛక్తి కొరతను కొంతవరకు అధిగమించవచ్చునని చెప్పారు.

ప్రారంభంలో సభలోని వివిధ వర్గాల సభ్యులు మొత్తం దేశంలో విద్యుచ్ఛక్తి కొరత కొనసాగడంపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రస్తుత దుస్థితిని తొలగించడానికి సత్వరచర్యలు తీసికొనాలని వారు కోరారు. స్పీకర్ శ్రీ జి.ఎస్. ధిల్లాన్ ఈ సమస్య తీవ్రమైనదిగా భావించి, ప్రశ్నోత్తర సమయంలో మొదటి ఇరవై అయిదు నిమిషాలలో దీనికి సంబంధించిన ప్రశ్న గురించి చర్చించడానికి అనుమతించారు.

శ్రీ జ్యోతిర్మయిబసు అడిగిన ప్రశ్నకు మంత్రి బదులుచెబుతూ, చతుర్థ ప్రణాళిక ఆఖరునాటికి విద్యుచ్ఛక్తి ఉత్పాదక శక్తిని 230 లక్షల కిలోవాట్ల మేరకు పెంచడానికి సంకల్పించగా, అప్పటికి 170 లక్షల కిలోవాట్లను మాత్రమే సమకూర్చుకొనడం జరిగిందని చెప్పారు.

అనుకున్న ప్రకారం 230 లక్షల కిలోవాట్ల మేరకు ఉత్పాదకశక్తిని హెచ్చింపగలిగినప్పటికి గిరాకీ కూడా ఇంచుమించు అంతగా వున్నందున ఎంతపాటిగానైనా కొరత వుందేదని మంత్రి అన్నారు.

డాక్టర్ రావు అసలు ప్రశ్నకు బదులు చెబుతూ, ఎప్పటికప్పుడు గిరాకీ సప్లయిని మించి పోతున్నందున విద్యుచ్ఛక్తి కొరత తప్పడం లేదని, ప్రస్తుత దుస్థితి ఏర్పడడానికిగల ముఖ్యమైన కారణాలలో ఇది ఒకటని, విద్యుచ్ఛక్తి ఉత్పాదక కేంద్రాలు, విద్యుచ్ఛక్తి కార్యక్రమాల నిర్వహణ సామర్థ్యం తక్కువగా వుండడం రెండవ కారణమని పేర్కొన్నారు.

అయిదవ ప్రణాళిక కాలంలో విద్యుత్సరాదాన ప్రమాణాన్నిరెట్టింపు చేయడానికి అంటే దాదాపు 400 లక్షల కిలోవాట్ల మేరకు పెంపొందించడానికి పథకాలను రూపొందిస్తున్నట్టు, సాంకేతిక నిపుణులు అనుభవజ్ఞులుగా వున్నప్పుడే విద్యుచ్ఛక్తి కార్యక్రమాలు, విద్యుత్కేంద్రాల నిర్వహణ సామర్థ్యం ఇనుమడించగలదని భావిస్తున్నట్టు డాక్టర్ రావు చెప్పారు.

నాగభూమి ముఖ్యమంత్రిపై కాల్పులు

ఆయన పరివారంలో ముగ్గురి మృతి

కోహిమా, ఆగస్టు 8— నాగభూమి ముఖ్యమంత్రి హాకిషేసేమా, ఆయన కుమారై మరికొంతమంది పరివారంతో వెడుతుండగా ఇక్కడకు ఏడు కిలోమీటర్ల దూరంలో వున్న లోల్‌మతి గ్రామంవద్ద వారిపై అజ్ఞాత నాగాలు కాల్పులు జరపగా ముఖ్యమంత్రి బృందంలోని ముగ్గురు మరణించారు. ఆయన కుమారై గాయపడింది.

ఈ దాడి నేటి సాయంత్రం జరిగిందని అయితే ముఖ్యమంత్రి శ్రీ సేమా సురక్షితంగా వున్నారని అధికార ప్రతినిధి చెప్పారు.

భూకమతాలపై, పట్టణ ఆస్తులపై పరిమితి విధింపు

సాంఘిక సమానత్వసాధనకు బీజాలు నాటడమని ప్రధాని ఇందిర స్పష్టీకరణ

బొంబాయి, ఆగస్టు 8—

భూకమతాలపైన, పట్టణ ఆస్తులపైన పరిమితి విధించడం సాంఘిక సమానత్వానికి బీజాలు నాటడానికి ఒక మార్గంగా తాము పరిగణిస్తున్నామని ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి స్పష్టంచేశారు.

"ఇలస్ట్రేటెడ్ వీక్లీ" సంపాదకుడు శ్రీ కుష్వంత్ సింగ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని ఇలా అన్నారు:

"ఈ చర్యల ద్వారా మాకు ఎంత భూమి లభిస్తే, అంత భూమిని భూమిలేని వారికి ఇస్తాము దానివల్ల మాకు సాధ్యమైనంతమేరకు మేము చేశామన్న అభిప్రాయం పేదలకు కలుగుతుంది. వారు సంతృప్తిపడతారు."

పట్టణ ఆస్తులపై పరిమితి విధించడం వల్ల ఎట్టి ప్రయోజనం వుండబోదన్న అభిప్రాయంతో ఆమె ఏకీభవించలేదు. పట్టణాలలో స్థలాలను, పెద్ద పెద్ద భవంతులను అక్రమించుకొనడం ద్వారా పేదలకు గృహాలు నిర్మించడానికి స్థలం సమకూరగలదని శ్రీమతి ఇందిరా గాంధి అన్నారు.

అసలు అన్నింటికంటె ప్రధానమైనది సంపన్నులకు, పేదలకు మధ్యగల అంతరాన్ని తగ్గించడానికి ప్రభుత్వం శాయశక్తులా కృషిచేస్తున్నదన్న భావం సామాన్య మానవునికి కలుగడమేనని ప్రధాని ఉద్ఘాటించారు.

ఆదాయాలపై పరిమితి

భూకమతాలపైన, పట్టణ ఆస్తులపైనా కాకుండా ఇతరత్రా వచ్చే ఆదాయాలపై పరిమితిని గురించి ప్రస్తావిస్తూ, "ఈ విషయాన్ని గురించి చర్చించాము. అయితే, ఇంకా ఖచ్చితమైన నిర్ణయాలకు రాలేదు" అని చెప్పారు."సమాజంలో తారతమ్యాలను తగ్గించడానికి ఈ చర్యలు తలపెట్టాము. ఈ చర్యలు గైకొనని పక్షంలో త్వరలోనే విప్లవం వస్తుంది" అని కూడా శ్రీమతి గాంధి అన్నారు.

ఏమైనా హింసాయుత విప్లవానికి తాను వ్యతిరేకినని, శాంతియుత మార్గాల ద్వారా మార్పులు తీసుకొని రావచ్చునని తాను ఆశిస్తున్నానని ఆమె అన్నారు.

ఈ లక్ష్యాల సాధనకు సమర్థమైన, నిజాయితీగల పరిపాలనా యంత్రాంగం అవసరమన్న శ్రీ కుష్వంత్‌సింగ్ అభిప్రాయంతో తాను ఏకీభవిస్తున్నానని ప్రధాని అన్నారు.

"సివిల్ సర్వీసెస్‌లోకి యువకులు వస్తున్నారు. వారు సమర్థులు, నిజాయితీకలవారు. ఒక లక్ష్యానికి అంకితమైన వారు" అని శ్రీమతి గాంధి అన్నారు.

"మొత్తంమీద మీద గైకొననున్న చర్యలు విప్లవంవలె వున్నవి కదా?" అని ప్రశ్నించగా, "మనకు మరొకమార్గం లేదు ఈ మార్పులను శాంతియుత పద్ధతుల ద్వారా తీసుకొని రావాలి. లేకపోతే హింసాయుత విప్లవం తప్పదు" అని ప్రధాని స్పష్టం చేశారు.

స్వాతంత్ర్యం వచ్చిన 25 సంవత్సరాలలో సాధించినదేమిటి ? అని ప్రశ్నించగా "స్వేచ్ఛా, ప్రజాస్వామ్య దేశంగా మనగలగడమే మనము సాధించిన గొప్ప విజయం, పరిపక్వదశకు చేరుకొన్నాము. మనం సాధించిన విజయాలు ఇంకా చాలా వున్నాయి" అని ఆమె చెప్పారు.

పరాజయాలను గురించి ప్రస్తావిస్తూ దేశ ప్రజలలో ఆధునిక దృక్పథాన్ని అలవర్చలేకపోయామని. ఇది ఒక పరాజయమని శ్రీమతి గాంధి అన్నారు.

జనాభా పెరుగుదలను అరికట్టడంలో మన వైఫల్యం ఒక పెద్ద మాయనిమచ్చగా తాను పరిగణించడాలనని శ్రీమతి గాంధి అన్నారు.

మహారాష్ట్రలో మద్యం పర్మిట్ల నిబంధన సడలింపు

బొంబాయి, ఆగస్టు 8— మహారాష్ట్రలో మద్యాలనుకొని, త్రాగడానికి అవకాశమిచ్చే హెల్త్ పర్మిట్ల పద్ధతి నేడు మరింత ఉదారత్వాన్ని పొందింది.

21 సంవత్సరాలపైన వయస్సుగల ఏ వ్యక్తి అయినా ఎట్టి షరతులు లేకుండా మద్యం పర్మిట్‌ను పొందవచ్చునని ఇక్కడ అధికారపూర్వకంగా ప్రకటించారు.

ప్రెసిడెంట్ సాదత్‌తో త్వరలో ముజిబ్ చర్చలు

లండన్‌నుంచి స్వదేశం తిరిగి వెడుతూ కయిరోలో ఆగిన సందర్భంలో సంభవం

కయిరో, ఆగస్టు 8—

బంగ్లాదేశ్ ప్రధాని షేక్ ముజిబుర్ రహమాన్ స్వదేశం తిరిగి వెళ్ళేటప్పుడు, ప్రెసిడెంట్ అన్వర్ సాదత్‌తో చర్చల నిమిత్తం కయిరో సందర్శిస్తారని వార్తాపత్రిక అల్‌అహ్రాం వెల్లడించింది.

ముజిబుర్ రహమాన్ గత వారం వైద్య చికిత్సకోసం లండన్ వెళ్ళారు.

ఇస్లామిక్ దేశాలలో, అరబ్ దేశాలలో ఈజిప్టు పాత్ర దృష్ట్యా ఉభయ దేశాలమధ్య సంబంధాలను గురించి తమ అభిప్రాయాలను తెలుపుతూ రహమాన్ సాదత్‌కు సందేశం పంపించారని, అందులో కయిరో సందర్శన గురించి వ్రాశారని ఆ పత్రికలో వ్రాశారు.

బంగ్లాదేశ్, అరబ్ రాజ్యాల మధ్య సంబంధాల గురించి చర్చించే ఈ ముఖ్యమైన సమావేశానికి సాదత్ షేక్‌ను ఆహ్వానించారని పత్రిక వ్రాసింది.

ఈజిప్టు ఇంతవరకు బంగ్లాదేశ్‌ను గుర్తించలేదు.

అగ్నిగుండాలవరకు సాగర్ మెయిన్ కాలువ

అదనంగా ఒక కోటి గ్రాంటు ఇవ్వవలసిందని కేంద్రానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) గుంటూరు, ఆగస్టు 8—

గుంటూరు జిల్లాలో అగ్నిగుండాల వరకు నాగార్జునసాగర్ మెయిన్ కాలువ పని పూర్తిచేయడానికి అదనంగా ఒక కోటి రూపాయలు గ్రాంటు చేయవలసినదని రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ ఎ. భగవంతరావు నేడు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

వినుకొండ తాలూకాలో ఏర్పడిన తీవ్ర దుర్భిక్ష పరిస్థితిని ఎదుర్కొనడానికి ఈ కాలువను పూర్తిచేయడం అత్యవసరమని మంత్రి విలేకరులకు చెప్పారు.

అగ్నిగుండాల రాగి ప్రాజెక్టు త్వరిత గతిన అభివృద్ధి చెందడానికి, వినుకొండ పట్టణానికి మంచినీటి సౌకర్యం కల్పించడానికి నాగార్జునసాగర్ జలాలు అవసరమని ఆయన చెప్పారు.

నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతం లోకలైజేషన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలో చేపట్టగలదని ఆయన ప్రకటించారు.

జిల్లాలో కరవు పరిస్థితిని గురించి మంత్రి జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు. ఇంకా ఎక్కువ సంఖ్యలో చౌకడిపోలు తెరవవలసినదని, గ్రామాలలో వెంటనే కరవు పనులు ప్రారంభించవలసినదని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు.

చక్కెర ధరపై ప్రభుత్వం ప్రకటన

గురువారంలోపుగా చేయాలని లోకసభ స్పీకర్ ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 8— చక్కెరధరపై వచ్చే గురువారం చర్చ ప్రారంభించడానికి ముందుగా చక్కెర ధర, సరఫరా పరిస్థితిపై ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని లోకసభ స్పీకర్ శ్రీ జి. ఎస్ ధిల్లాన్ ఆదేశించారు.

చక్కెర ధర విపరీతంగా పెరగడంపై వాయిదా తీర్మానం ప్రతిపాదించగోరుతున్నట్టు మార్క్సిస్టుపార్టీ సభ్యుడు శ్రీజ్యోతిర్మయి బసు నేడు "జీరో అవర్"లో పేర్కొనగా ఆయనను పలువురు సభ్యులు బలపరిచారు.

అయితే చక్కెర ధరపై గురువారం నాడు చర్చ జరపాలని ఈ వరకే నిర్ణయించినదృష్ట్యా వాయిదా తీర్మానానికి స్పీకర్ అనుమతించలేదు.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ ఇంద్రజిత్ గుప్తా సూచనపై ప్రభుత్వాన్ని ఆయన పైవిధంగా ఆదేశించారు.

ధరల పెరుగుదలను అరికట్టడంలో ప్రభుత్వం వైఫల్యం: రాజ్యసభలో విమర్శ

న్యూఢిల్లీ, ఆగస్టు 8—

నిత్య జీవితావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైనదని నేడు రాజ్యసభలో పలువురు సభ్యులు నిశితంగా విమర్శించారు.

ఇటీవలి నెలలలో ధరలు విపరీతంగా పెరిగాయని వారు పేర్కొన్నారు.

ఈ అంశంపై స్వతంత్రపార్టీ సభ్యుడు శ్రీ లోకనాథమిశ్రా చర్చను ప్రారంభిస్తూ ధరలు పెరుగుదలకు కారణం వాతావరణ పరిస్థితులన్న అధికారుల వాదన సరికాదని అన్నారు.

ధరలు విపరీతంగా పెరగడానికి ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు ఆర్థిక విధానాలే కారణమని ఆయన చెప్పారు.

ప్రణాళికేతర వ్యయం విపరీతంగా పెరగడం, ప్రణాళికలో లోపాలు, లోటు ఆర్థిక వ్యవస్థ, రాష్ట్రాలకు ఉదారంగా ఓవర్ డ్రాఫ్టులు అనుమతించడం, పారిశ్రామిక పెరుగుదల తగ్గడం, ప్రభుత్వ రంగంలోని సంస్థలకు పెద్దఎత్తున నష్టాలు రావడం, రైల్వేల నిర్వహణలో అసమర్థత ప్రస్తుత ధరల పెరుగుదలకు కారణమని శ్రీ మిశ్రా అన్నారు.

భూకమతాలపై 18 ఎకరాల పరిమితి

మహారాష్ట్ర అసెంబ్లీలో రెవిన్యూ మంత్రిచే బిల్లు ప్రతిపాదన

బొంబాయి, ఆగస్టు 8— మహారాష్ట్రలో భూకమతాలపై 18 నుంచి 54 ఎకరాలు గరిష్ఠ పరిమితిగా నిర్ణయించే బిల్లును రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపాదించారు.

రెవిన్యూమంత్రి శ్రీ హెచ్.వి. వార్తక్ ప్రవేశపెట్టిన ఈబిల్లు 1970 సెప్టెంబర్ 26 నుంచి అమలుకు వస్తుంది.

ప్రభుత్వం నిర్వహించే వనరులు నుంచి నీరు లభించే భూములపై అయిదుగురు గల కుటుంబానికి 18 ఎకరాలు గరిష్ఠ పరిమితిగా నిర్ణయించారు.

బావులద్వారా సాగుచేయబడి రెండు పంటలుపండే భూములపై 27 ఎకరాల గరిష్ఠ పరిమితి నిర్ణయించారు.

వర్షం లభించగలదని నమ్మకం కల మెట్టభూములపై 36 ఎకరాలు ఇతర మెట్ట భూములపై 54 ఎకరాల పరిమితిగా నిర్ణయించారు.

ప్రస్తుతంవున్న చట్టంలో 126 ఎకరాల వరకు భూమికలిగి వుండడానికి అవకాశం వున్నది.

అయిగురు సభ్యులుగల కుటుంబాన్ని ఒక యూనిట్‌గా నిర్ణయించారు.

పాకిస్తాన్ రైల్వే బోర్డు చెయిర్మన్ రాజీనామా

న్యూఢిల్లీ, ఆగస్టు 8— లఖచూర్ వద్ద జరిగిన రైలు ప్రమాదాన్ని పురస్కరించుకుని పాకిస్తాన్ రైల్వే బోర్డు చెయిర్మన్ రాజీనామా చేశారు. ఈ రైలు ప్రమాదంలో 64 మంది మరణించారు.

చెయిర్మన్ రాజీనామాను ప్రెసిడెంట్ భుట్టో ఆమోదించారని పాకిస్తాన్ రేడియో వెల్లడించింది.

విధినిర్వహణలో అగ్రతగా వున్న వారిని శిక్షించి తీరుతామని భుట్టో చెప్పారు.

రవాణా మంత్రి ముస్తఫా జాతోయి కూడా రాజీనామా చేశారని, అయితే తాము ఆమోదించలేదని భుట్టో చెప్పారు.

1972 ఆగస్టు 9 బుధవారం
శ్రీ వరీధావినామ సంవత్సర ఆషాఢ అమావాస్య
అమావాస్య: ఉ॥ 10–56 ఆశ్లేష: రా॥ 11–05
వర్జ్యం: ప॥ 12–02 నుంచి 1–37 వరకు

* * * *

1972 ఆగస్టు 10 గురువారం
శ్రీ వరీధావినామ సంవత్సర శ్రావణ శుద్ధ పాడ్యమి
పాడ్యమి: ఉ॥ 10–14 మఘ: రా॥ 11–22
వర్జ్యం: ప॥ 11–13 నుంచి 12–50 వరకు

ఆంధ్రజ్యోతి
"తమసో మా జ్యోతిర్గమయ"

ఇరవై అయిదేళ్ల తర్వాత...

కడచిన 25 సంవత్సరాలలో మనదేశం బహుముఖంగా పురోగమించిన మాట నిజమే. అయినా, ఏ ఒక్క కొరత పూర్తిగా తీరలేదు, ఏ ఒక్క సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదు.

ఇది తొందరపాటు మాటకాదు, బాధ్యతా రహితమైనట్టిది అసలే కాదు.

మరి కొద్ది రోజులలో మన స్వాతంత్ర్య దినం రజతోత్సవాన్ని జరుపుకొనబోతున్నాము. అయినా, ఇదే సమయంలో రేపు తమ గతి ఏమి కానున్నదని ఎంతమంది కలత చెందడంలేదు? తక్కిన ఎషయాలను విడిచి పెట్టండి: "రేపు తినడానికి తిండి దొరుకుతుందా? రేపు త్రాగడానికి నీళ్ళు దొరుకుతాయా?" అని ఎందరెందరో కలవరపడుతున్నారు.

"ఎట్టి ముప్పు రాబోదు" అని భారత ప్రభుత్వం అభయ మిస్తున్నది. "95 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు కేంద్ర ప్రభుత్వం గిడ్డంగులలో నిలవ వున్నా"యని అది ప్రకటిస్తున్నది. "క్షామ ప్రసూదం రా"దని కూడా అది గట్టిగా చెబుతున్నది.

ఇంతేకాదు, ఆగిపోయిన వానలు తిరిగి ప్రారంభమైనవి కాబట్టి ఇంతకుముందు భయపడినంతగా పైర్లు దెబ్బతినకపోవచ్చునని అది విశ్వసిస్తున్నది. మొదటిపంట సరిగా పండకపోవడంవల్ల ఏర్పడగల ఆహార ధాన్యాల కొరతను తగ్గించడానికి రెండవ పంటను మరింతగా పండించడానికి వలసిన పథకాలను విస్తృతంగా అమలుజరపడానికి సన్నద్ధపడుతున్నది.

విపత్తు సమ్ముఖంలో గుండె చెదరక, దాన్ని సాహసంతో, బహుముఖంగా ఎదుర్కొనడానికి ఆయత్తపడుతున్న ప్రభుత్వాన్ని, దాని నాయకులను మెచ్చుకోవాలి. అయినా, మనం స్వాతంత్ర్యం పొందిన తర్వాత ఇరవై అయిదవ సంవత్సరంలోకూడా మన బ్రతుకులు సకాల వర్షాలపై ఇంతగా ఆధారపడి వుండడం మన ఆర్థిక, సాంఘిక, రాజకీయ, ప్రభుత్వ వ్యవస్థలలో ఏవో పెద్ద లోపాలున్నట్టు స్పష్టం చేయడంలేదా? మన స్వాతంత్ర్యాన్ని మనం తగినంతగా సద్వినియోగం చేసుకొనలేదని రుజువు చేయడం లేదా?

మన ఆంధ్రప్రదేశ్ విషయంలో ఈ ప్రశ్నలు మరింత సమంజసమైనవని గట్టిగా చెప్పవచ్చు. గోదావరి, కృష్ణ, తుంగభద్ర, పెన్న, పంశధార మొదలైన నదులు ఎన్నెన్నో మన కున్నాయి. అయినా, "కురిస్తే పండినట్టు, లేకపోతే ఎండినట్టు" అనే దౌర్భాగ్యస్థితి మనకు తప్పడంలేదు. పైగా, ఈ నాడు పెక్కుచోట్ల పెక్కు లక్షలమంది మంచినీళ్ళకు సయితం గిజగిజ లాడవలసి వస్తున్నది.

ఈ మంచినీళ్ళ కరువు ఈనాటిది కాదు. కొన్ని చోట్ల రెండేళ్ళ క్రితమే ఇది వచ్చింది. అయినా, ఈ యేడు కురవని వానలు వచ్చే యేడు కురవక పోతాయా? అని వాటి కోసం ఎదురుచూడ్డం తప్ప, మంచినీళ్ళ కరువును తీర్చడానికి మన రాష్ట్ర ప్రభుత్వం ఏమి చేసింది? అది ఏమీ చేయలేదని మా తాత్పర్యం కాదు. 1971–72లోనే దుర్భిక్ష ప్రాంతాలలో పద్దెనిమిది కోట్లకుపైగా అది ఖర్చు చేసినట్టు మాకు తెలుసు. అయినా, లక్షలాదికి మంచినీటి కరువు తిరిగి తప్పడం లేదంటే, ఈ సమస్య ఈనాటికి కూడా సమస్యగానే మిగిలినట్టు విశదం కావడంలేదా?

పట్టణాలు త్వరగా పెరగడం, పట్టణాలలో జనాభా త్వరత్వరగా పెరగడం–ఇందువల్ల మంచినీళ్ళ కొరత ఏర్పడితే, ఇది అన్ని సందర్భాలలో అనివార్యమైన పరిణామం కాకపోవచ్చు. కాని, ఈ నాడు పల్లెలలోనే త్రాగడానికి నీళ్లు లేక అగచాట్లపాలు కావలసి వస్తున్నది. ఈ ఘోర పరిస్థితిని తొలగించడానికి కనీసం ఇప్పటి నుంచి అయినా ప్రభుత్వం గట్టి ప్రయత్నాన్ని చేస్తుందా? లేక, ఇప్పుడు కాకపోతే, మరొక నెలకు, మరొక నెలకు కాకపోతే, మరొక సంవత్సరానికి వానలు దండిగా కురవకపోతాయా? అని ఎదురుచూస్తూ కూర్చుంటుందా?

బంగారం ధరలలో పెరుగుదల

ఆర్థిక వ్యవస్థలో హెచ్చుతగ్గులకు దారితీయలేదని చవాన్ వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 8— బంగారం ధరలలో, ఇటీవల కానవచ్చిన ధోరణులు దేశపు ఆర్థిక వ్యవస్థపై గమనార్హమైన ఎట్టి ప్రభావాన్ని కలుగజేయలేకపోయినవని నేడు రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రి శ్రీ వై. బి. చవాన్ తెలియజేశారు.

శ్రీ సీతారామకేసరి అడిగిన ప్రశ్నకు జవాబు చెబుతూ, విదేశపు మార్కెట్లలో బంగారం ధరలలో హెచ్చుతగ్గులు వచ్చినందువల్ల ఇండియా రిజర్వులు ఏ మాత్రం మారలేవని, దేశపు మార్కెట్లలో బంగారపు ధరలు పెరిగినప్పటికీ ఇతర వస్తువుల ధరలలోగాని, సర్వీసుల వ్యయంలోగాని పెరుగుదల కనిపించకపోవచ్చునని ఆయన స్పష్టంచేశారు.

పాక్ జాతీయ అసెంబ్లీ సమావేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 8— ఆగస్టు 15 నుంచి సమావేశం కానున్న పాకిస్తాన్ జాతీయ అసెంబ్లీ మొత్తం 20 ఆర్డినెన్సులను ఆమోదింపవలసివుందని పాకిస్తాన్ రేడియో వెల్లడించింది.

నిన్న నాలుగు గంటలపాటు జరిపిన సమావేశంలో మంత్రివర్గం అసెంబ్లీకి సమర్పించే బిల్లులను పరిశీలించింది.

కార్మిక సంబంధాలకు సంబంధించిన బిల్లును మంత్రివర్గం ఆమోదించింది.

లెజిస్లేటర్, రాజ్యాంగ పరిషత్తుకు సంబంధించిన నిబంధనలను ఒకటి రెండు రోజులలో తయారుచేస్తారు.

రాజ్యాంగం నిర్ణయ సంఘం పదవీ కాలం పరిమితిని పొడిగించే తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెడతారు.

పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ సభావేశం రెండు రోజులపాటు ఇక్కడ జరుగుతుంది. దీనికి అధ్యక్షులు భుట్టో అధ్యక్షతవహిస్తారు.

అనంతరం పీపుల్స్ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఆగస్టు 12 వ తేదీన జరుగుతుంది.

చైనాలో సమష్టి నాయకత్వం

మావో అనంతరం అధికార స్వీకారం

లండన్, ఆగస్టు 8— మావో సేటుంగ్ తరువాత, ప్రధాని చౌ–ఎన్–లై నాయకత్వాన సమష్టి నాయకత్వం చైనాలో అధికారం స్వీకరిస్తుందని పశ్చిమ దేశాల దౌత్య వర్గాలద్వారా పీకింగ్ నుంచి ఇక్కడకు నేడు అందిన సమాచారాన్నిబట్టి తెలుస్తున్నది.

లిన్ పియావోను నియమించినట్టుగా ఏ ఒక నాయకుని మావో వారసుడుగా నియమించబోరన్న సూచనలు కనిపిస్తున్నాయి.

మైసూరునుంచి ప్రఖ్యాత సాహితీవేత్తలతో కూడిన త్రిసభ్య ప్రతినిధివర్గం ఆగస్టు 17 వ తేదీనుంచి కేరళలో అనులోజులపాటు పర్యటన జరపనున్నట్టు బెంగుళూరు వార్త.

తైవాన్‌తో ఇండియా వాణిజ్య సంబంధాలు

ప్రభుత్వ పరంగాలేవని లోకసభలో విదేశ వాణిజ్య మంత్రి శ్రీ మిశ్రా వివరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 8— తైవాన్‌తో వాణిజ్యం జరపడం ఆదేశంతో ఎట్టి రాజకీయ సంబంధాలు వుండరాదన్న ఇండియా నిర్ణయాన్ని మార్చుకొనడం కాదని విదేశ వాణిజ్య మంత్రి శ్రీ ఎల్.ఎన్. మిశ్రా నేడు లోకసభలో చెప్పారు.

సోషలిస్టు సభ్యుడు ప్రొఫెసర్ సమర్ గుహ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ, వాణిజ్య సంబంధాలు, రాజకీయ సంబంధాలు వేర్వేరు అంశాలని అన్నారు.

తైవాన్‌తో భారత ప్రభుత్వం నేడుగా వాణిజ్యం జరపడంలేదని, ప్రయివేటు సంస్థలు, లోహాల ఖనిజాల వాణిజ్య సంస్థవంటి సంస్థలు మాత్రమే తైవాన్‌తో వాణిజ్యం చేస్తున్నవని ఆయన అన్నారు.

అలా వాణిజ్యం జరిపేవారు కష్టనష్టాలకు తామే బాధ్యత వహించవలసి వుంటుందని, తైవాన్‌తో ఎట్టి వివాదం వచ్చినా దానికి ఇండియా బాధ్యత వహించబోదని ప్రభుత్వం హెచ్చరించినట్టు శ్రీ మిశ్రా వెల్లడించారు.

1971–72 లో ఇండియా, తైవాన్‌ల మధ్య 149 లక్షల రూపాయల విలువమేరకు వాణిజ్యం జరిగినదని, ఇది ఇండియాకే అనుకూలంగా వున్నదని ఆయన అన్నారు.

రవాణా పరికరాలు, ఇనుము, ఉక్కు సామగ్రి, మాంగనీస్, మైకా మొదలైనవి తైవాన్‌కు ఎగుమతిచేస్తూ, ప్లాస్టిక్ మొదలైనవి దిగుమతి చేసుకొంటున్నట్టు మంత్రి వివరించారు.

భారత విదేశాంగ శాఖ ప్రతినిధి ఎవరూ తైవాన్ సందర్శించలేదని, అయితే, వాణిజ్యం చేసే సంస్థల ఉద్యోగులు ఎనిమిదిమంది మాత్రం తైవాన్ సందర్శించారని శ్రీ మిశ్రా చెప్పారు.

బంగ్లాదేశ్‌కు ఇండియా సహాయం

బంగ్లాదేశ్‌కు సహాయం చేయడానికి బడ్జెట్‌లో కేటాయించిన రెండువందల కోట్ల రూపాయలలో 166 కోట్ల రూపాయల మేరకు సహాయాన్ని బంగ్లాదేశ్‌కు అందజేశామని ఆర్థిక మంత్రి శ్రీ వై. బి. చవాన్ నేడు రాజ్యసభలో చెప్పారు.

అదనపు సహాయం కావాలని బంగ్లాదేశ్ కోరినదా? అని శ్రీ మెహతా ప్రశ్నించగా "లేదు" అని శ్రీ చవాన్ బదులు చెప్పారు.

ఇండియా, బంగ్లాదేశ్ ప్రధానులు చేసిన నిర్ణయాన్ని పురస్కరించుకొని ఏయే రంగాలలో రెండు దేశాల మధ్య సహకారం అవసరమన్న విషయాలను పరిశీలించడానికి రెండుదేశాల ప్లానింగ్ కమిషన్ ప్రతినిధులు అప్పుడప్పుడు సమావేశం కాగలరని శ్రీ చవాన్ తెలియజేశారు.

బంగ్లాదేశ్ ప్రణాళిక, ఆర్థిక శాఖ మంత్రి ఇటీవల బంగ్లాదేశ్ సందర్శించారని, అయితే, అయన భారతీయ ఉద్యోగులతో జరిపిన చర్చలలో అదనపు సహాయం కావాలని కోరలేదని ఆర్థిక మంత్రి చెప్పారు.

బంగ్లాదేశ్‌కు సహాయాన్ని పెంచవలసిందిగా మిత్రదేశాలను భారత ప్రభుత్వం కోరినదా? అని శ్రీ మెహతా ప్రశ్నించగా, ఈ ప్రశ్నకు శ్రీ చవాన్ అభ్యంతరం చెప్పారు. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశమని, అందువల్ల ఆ దేశం తరపున ఇతరులను ఇండియా కోరడం సముచితం కాదని అయన చెప్పారు.

ఆహార ధాన్యాల వరఫరాకు బంగ్లాదేశ్ ప్రభుత్వం ఇండియా నుంచి ఆర్థిక సహాయాన్ని కోరినదని శ్రీ కల్యాణ్‌రాయ్ ప్రశ్నకు శ్రీ చవాన్ బదులు చెప్పారు.

దామోదర్ మండోవీ నౌక మునక

ఇటీవల సముద్రంలో మునిగిపోయిన "దామోదర్ మండోవీ" నౌక నుంచి బ్రతికి బయటపడ్డవారి కోసం గాలింపు జరపడానికి ఇండియాకు పాకిస్తాన్ అధికారులు అనుమతించని మాట వాస్తవమేనా అని రాజ్యసభలో జనసంఘ్ సభ్యుడు అడిగిన ప్రశ్నను నౌకా వాణిజ్య శాఖ మంత్రి శ్రీ రాజ్ బహదూర్ ఖండించారు.

ఆ నౌకా ప్రమాదం పాకిస్తాన్ ప్రాంతీయ జలాలకు వెలుపల జరిగినందువల్ల గాలింపుకు పాకిస్తాన్ అనుమతిని కోరే సమస్య ఉత్పన్నం కాలేదని శ్రీ రాజబహదూర్ చెప్పారు.

అలీన రాజ్యాల సభలో దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వం ప్రతిపత్తి

రాయబారులు ఎట్టి నిర్ణయానికి రానిస్థితి

జార్జిటౌన్, ఆగస్టు 8— అలీన రాజ్యాల రాయబారులు గత రాత్రి ఇక్కడ సమావేశమై విదేశాంగ మంత్రుల సభలో వియత్నాం విప్లవ ప్రభుత్వానికి పూర్తి సభ్యత్వం ఇచ్చే విషయమై చర్చించారు. కాని ఎట్టి నిర్ణయానికి రాలేకపోయారు.

అలాగే కంబోడియానుంచి వచ్చిన రెండు ప్రతినిధివర్గాలలో ఏ ప్రతినిధి వర్గానికి ప్రాతినిధ్యం ఇవ్వాలన్న విషయంలో కూడా తగు నిర్ణయానికి రాలేకపోయారు.

ఈ రెండు అంశాలపైన విదేశాంగ మంత్రులు తమంతట తాము తగునిర్ణయాలు గైకొనాలని రాయబారుల సమావేశం అభిప్రాయపడింది.

అలీనదేశాల విదేశాంగ మంత్రుల సమావేశంలో దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వానికి పూర్తి ప్రాతినిధ్యం ఇవ్వాలని క్యూబా, అల్జీరియాలు, ఆ ప్రభుత్వానికి దౌత్య రీత్యా గుర్తింపు ఇచ్చిన మరికొన్ని దేశాలు గట్టిగా కోరాయి. విప్లవ ప్రభుత్వాన్ని ఇండియా ఇంకా గుర్తించలేదు కాని, ఈసమస్యపై విదేశాంగమంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చిన పక్షంలో తాము ఆమోదించగలమని ఇండియా చెప్పినట్టు తెలుస్తున్నది. ఈ విషయమై వివిధ దేశాల ప్రతినిధివర్గాల మధ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే విప్లవ ప్రభుత్వానికి ప్రాతినిధ్యం విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవచ్చునని అనుకుంటున్నారు.

బ్రాహియన్, యునైటెడ్ అరబ్ ఎమిరాట్‌లను చేర్చుకొనే విషయంలో కూడా రాయబారుల స్థాయి సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు.

ఆ రెండు దేశాలకు బ్రిటన్‌తో సైనిక ఒప్పందాలు కలవని పేర్కొంటూ ఆ దేశాలను అలీన దేశాల సమావేశానికి ఆహ్వానించడానికి దక్షిణ ఎమెన్ అభ్యంతరం చెప్పినట్టు తెలుస్తున్నది.

వియత్నాం విప్లవ ప్రభుత్వం ఆశాభావం

జార్జిటౌన్, ఆగస్టు 8— ఇక్కడ ప్రారంభంకానున్న అలీనరాజ్యాల విదేశాంగ మంత్రుల సభలో తమ దేశానికి సభ్యత్వం లభించగలదని తమ ప్రతినిధివర్గం ఆశిస్తున్నట్టు దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వం నాయకుడు శ్రీ హుంథ్ బిన్‌సన్ నేడిక్కడ చెప్పాడు.

దక్షిణ వియత్నాం విప్లవ ప్రభుత్వం తరపున అయిదుగురు సభ్యులుగల ప్రతినిధివర్గం ఈ సమావేశానికి హాజరౌతున్నది. ఈ ప్రతినిధివర్గాన్ని హవానానుంచి తమ విమానంలో క్యూబా విదేశాంగ మంత్రి రాపుల్ రోవాగార్సి ఇక్కడకు తీసుకొని వచ్చారు.

అలీన రాజ్యాల విదేశాంగ మంత్రుల సమావేశంలో విప్లవ ప్రభుత్వ ప్రతినిధి వర్గానికి పూర్తి సభ్యత్వం ఇవ్వాలని క్యూబా అల్జీరియా, మరికొన్ని దేశాలు ప్రతిపాదించగలవని భావిస్తున్నారు. వియత్నాం విప్లవ ప్రభుత్వం ప్రతినిధివర్గానికి ప్రస్తుతం పరిశీలకుని హోదా మాత్రమే వుంది.

మద్రాసు పోలీసు కమిషనర్ నగరంలో నెయింట్ జార్జికోట ప్రాంతంలో పది రోజులవరకు సభలను ఊరేగింపులను నిషేధిస్తూ ఉత్తరువు జారీ చేశారు.

ఆంధ్రజ్యోతి ఆంధ్రప్రదేశ్ అగ్నిబాధితుల సహాయ నిధి

విజయవాడ, ఆగస్టు 8— ఆంధ్రప్రదేశ్‌లోని అగ్నిబాధితుల సహాయార్థం "ఆంధ్రజ్యోతి" ప్రారంభించిన నిధికి నేడు కొత్తగా అందిన విరాళాల వివరాలు ఈ దిగువ ప్రచురిస్తున్నాము:

నిన్నటి మొత్తం:	1,04,039–67
కుమారి జి. స్వరాజ్యలక్ష్మి, వెంట్‌జోనెఫ్ కాన్వెంటు స్కూలు, గుంటూరు.	21–33
రేపల్లె సహకార భూమి తనఖా బ్యాంకి చేతనోద్యోగులు.	20–00
రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కాలేజి సీనియర్ ఇంటర్మీడియెట్ కామర్స్‌విద్యార్థులు, ధరణికోట.	17–05
శ్రీ బి. హెచ్. సీతారామరాజు, కోవ రేటివ్ షుగర్‌ఫ్యాక్టరీ సాలంకొల్లు	15–00
మెన్సర్స్ మెహర్ క్లాత్ సెంటర్, ప్రొ॥ఎం. నరసింహమూర్తి, శ్రీకాకుళం	5–05
శ్రీ డి. వి. వి. విద్యాసాగర్, సివిల్ సబ్‌డివిజన్, పి అండ్ టి బొంబాయి.	5–00
గుంటుపల్లి జిల్లా పరిషత్తు హైస్కూలు తొమ్మిదవ తరగతి విద్యార్థులు	5–00
శ్రీ ఎం. భీమశంకరం, తిరుపతి	5–00
నేటి మొత్తం:	1,04,133–10

సెప్టెంబరులో జపాన్ ప్రధాని చైనా పర్యటన

టోక్యో, ఆగస్టు 8— టోక్యో–పీకింగ్‌ల మధ్య దూమూలు సంబంధాలు నెలకొల్పే విషయమై చర్చలు జరపడానికి సెప్టెంబరు నెలలో తాను చైనా వెడతానని జపాన్ ప్రధాని కాకుయి తనాకా నిన్న ఇక్కడ చెప్పారు.

సెప్టెంబరు 20–25 తేదీల మధ్య శ్రీ తనాకా పీకింగ్ సందర్శిస్తారని, లిబరల్ డెమొక్రటిక్ పార్టీలో ఒప్పందానికి వస్తే చైనా వెడతారని ఇక్కడవర్తికా వార్తలనుబట్టి తెలుస్తున్నది.

శ్రీ తనాకా విలేకరులతో మాట్లాడుతూ, చైనాకు వెళ్ళడానికి కాలం పరిపక్వమైందని, అయితే, చైనీయుల వీలుపై తన పర్యటన ఆధారపడి వుంటుందని అయన చెప్పారు.

కెనరా బ్యాంకి జెన్‌సన్‌టౌన్ బ్రాంచిలో ఆగస్టు ఏడవ తేదీ ఉదయం దోపిడి చేయడానికి జరిపిన ప్రయత్నం పూర్తిగా విఫలమైనట్టు బెంగుళూరు వార్త.

చౌకడిపోల ద్వారా ఆహారధాన్యాల పంపిణీ

కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 8—కేంద్ర ప్రభుత్వం గత కొన్న నిర్ణయాలను వెంటనే అమలుజరపడానికి ప్రభుత్వ ఆహార వాణిజ్య సంస్థకు కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ ఈ క్రింది ఉత్తర్వు జారీ చేసింది:

1. కేంద్రం నిల్వలనుంచి విడుదలయ్యే ఆహార ధాన్యాలను రాష్ట్ర ప్రభుత్వాల యంత్రాంగం ద్వారా పంపిణీ చేయాలి. కేంద్రం ఇచ్చే కోటాలను చౌక డిపోల ద్వారా పంపిణీకి ఏర్పాట్లు జరగాలి.

2. బహిరంగ మార్కెట్‌లకు ఆహార ధాన్యాల సరఫరాను ప్రభుత్వ ఆహారవాణిజ్య సంస్థ వెంటనే నిలిపివేయాలి.

3. ప్రభుత్వ ఆహార వాణిజ్య సంస్థవద్దగల మతకధాన్యం నిల్వలను చౌకదుకాణాల ద్వారా పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించారి. స్థానిక ప్రజలు మామూలుగా వినియోగించే ఆహార ధాన్యాలనే ఆయా ప్రాంతాలకు విడుదల చేయాలి.

4. ప్రభుత్వ ఆహార వాణిజ్య సంస్థవద్దగల అపరాల నిల్వలను చౌక డిపోలద్వారా పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేయాలి.

5. రోలర్ ఫ్లోర్‌మిల్స్ నుంచి గోధుమ ఉత్పత్తుల పంపిణీ బాధ్యతను స్వాధీనం చేసుకోవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించడం జరిగింది. గోధుమ ఉత్పత్తుల పంపిణీ చౌక దుకాణాలద్వారా క్రమబద్ధం చేస్తారు.

వివిధ రాష్ట్రాలలో దుర్భిక్ష పరిస్థితులు

కేంద్ర మంత్రివర్గం చర్చ

న్యూఢిల్లీ, ఆగస్టు 8— వివిధ రాష్ట్రాలలో దుర్భిక్ష పరిస్థితులు, ప్రస్తుత ధర వరలను గురించి కేంద్ర మంత్రివర్గం నిన్న ఇష్టాగోష్ఠి సమావేశంలో చర్చించింది.

నిన్న, ఉత్తరప్రదేశ్‌లో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ ఫక్రుద్దీన్ అలీ అహ్మద్, ఆ రాష్ట్రంలో పరిస్థితులపై తన అంచనాను, రాష్ట్రానికి అవసరమైన సహాయాన్ని గురించి వివరించారు.

పశ్చిమ మహారాష్ట్ర, విదర్భ ప్రాంతాలలో దుర్భిక్ష పరిస్థితిని గురించి వ్యవసాయ శాఖ స్టేట్ మంత్రి శ్రీ ఎ.బి. షిండే మంత్రివర్గానికి వివరించారు.

ధరల సమస్యపై ఈ సమావేశం ఎట్టి నిర్ణయానికి రాలేదు. ఒకటి రెండురోజులలో మంత్రివర్గం తన నిర్ణయాలను తుదిరూపమివ్వవచ్చునని తెలుస్తున్నది.

రాబీ సీజన్‌లో అధిక రాలుబడి

ప్రొఫెసర్ షేర్‌సింగ్ ఆశాభావం

న్యూఢిల్లీ, ఆగస్టు 8— దుర్భిక్షంవల్ల ప్రస్తుత ఖరీఫ్ పంటలో రాగల నష్టాన్ని రాబీ పంటలో భర్తీ చేయవచ్చునని కేంద్ర వ్యవసాయ శాఖ స్టేట్ మంత్రి ప్రొఫెసర్ షేర్ సింగ్ చెప్పారు.

పంప్‌సెట్ల పరిశ్రమ విస్తృతం కావడం, దాపుల త్రవ్వకానికి రిగ్గులను ఉపయోగించడం వల్ల రాబీ పంట రాలుబడి హెచ్చుగా వుండగలదన్న ఆశాభావాన్ని అయన వ్యక్తం చేశారు.

ఇండియన్ పంప్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ వార్షిక సమావేశంలో ప్రసంగిస్తూ ప్రొఫెసర్ షేర్‌సింగ్ పైవిధంగా అన్నారు.

రానున్న కొద్ది నెలలలో ఇరిగేషన్ సౌకర్యాలు త్వరితగతిని విస్తరించడానికి అవకాశం కలదని ప్రొఫెసర్ షేర్‌సింగ్ చెప్పారు.

అమ్మకం పన్ను ఎగవేతను కనుగొనడానికి కొత్త పద్ధతి

అల్ట్రావయొలెట్ కిరణాల ప్రసారంద్వారా శ్రీకాకుళంజిల్లా అధికారుల ప్రయోగం

విశాఖపట్నం, ఆగస్టు 8— ధాన్యం, బియ్యం మిల్లర్ల అమ్మకపు పన్ను ఎగవేతలను కనుగొనడానికి, శ్రీకాకుళం జిల్లా, రాజాం ప్రాంతంలో అమ్మకపు పన్ను అధికారులు అల్ట్రావయొలెట్ కిరణాలను ఉపయోగించారు.

అమ్మకానికి సంబంధించిన బిల్లులలో హెచ్చులుచేయడం ద్వారా మిల్లర్లు నాలుగు లక్షల రూపాయల మేరకు దిగుమతి రాకుండా అణచివేసినట్టు తెలిసింది.

విశాఖపట్నం, వాణిజ్య పన్నులశాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీ పి. సీతాపతి మార్గదర్శకత్వం కింద అధికారులు, నెల్సు బిల్లులను అల్ట్రావయొలెట్ కిరణాలకు గురిచేయగా ఇది బయటపడింది.

ఆంధ్ర యూనివర్శిటీకి చెందిన శాస్త్రజ్ఞుల సహాయంతో అమ్మకపు పన్ను అధికారులు ఈ కిరణాల పరీక్ష జరిపారు.

చట్టప్రకారం పన్నుల ఎగవేత దారులపై చర్యతీసుకొనడం జరుగుతున్నది. శ్రీకాకుళం జిల్లా రాజాం ప్రాంతంలోను, విశాఖపట్నం జిల్లా కొత్తవలసలోను అధికారులు ఈ దాడులు జరిపారు.

వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమీషనర్ శ్రీ పి. సీతాపతి, శ్రీకాకుళం, విశాఖ జిల్లాలకు చెందిన అధికారులు శ్రీయుతులు ఇ. సుబ్బారావు, డి. భూషణరావు, కె. వీరాచార్యులు జి. సన్యాసిరాజుల సహాయంతో ఈ దాడులు నిర్వహించారు.

దినవాక్యం

స్వాతంత్ర్య యోధులకు ఆహ్వానాలు

ఆగస్టు 15న స్వాతంత్ర్య యోధులకు సన్మానం జరిపి పతకాలిస్తూ పెన్షనుకూడా ఇవ్వడానికై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రకటించినాయి.

అరు మాసాలు జైలు శిక్ష అనుభవించిన ఊరి ఖాదీ కాలు తయారుచేస్తున్నారు. ఈ తయారు చేయడంలో ఏ జిల్లాలో ఎందరు అర్హులుగా నిర్ణయించబడ్డారో, ఎందరు ఇంకా పరిశీలనలో వున్నారో తెలియదు. అగస్టు 15 దగ్గర పడుతున్నది.

కాబట్టి సాధ్యమైనంత త్వరలో జైలు సర్టిఫికెట్లు స్వయంగా పంపకపోయిన రాష్ట్రప్రభుత్వం వద్ద అన్ని వివరాలూ వున్నాయిగాన అరు మాసాలు శిక్ష అనుభవించిన వారికందరికీ కూడా ఆహ్వానాలు అందజేస్తూ వారు ఎక్కడికి ఏ సమయానికి రావాలో కూడా తెలియజేయడం చాలా అవసరం.

తుమ్మల గోపాలకృష్ణయ్య,
రూపిపూడి, తెనాలి తాలూకా.

స్వార్జితంలో మేజర్లకు వాటా

భూ సంస్కరణ రెక్కలు చేరకణలో వీలుపు ప్రాంతంలో రెవిన్యూ అధికారులు ఒక తండ్రికిగల స్వార్జితం దాపరు భూములు అతని కుమారులు మేజర్లయినప్పుడికి గవర్నమెంటు వారి సూచనల ప్రకారం 1970 జూన్ ఒకటవ తేదీ నాటికి అతని కుటుంబ సభ్యులు వ్రాసి రిజిస్ట్రేషన్ చేసివుండేనేతప్ప హిందూ లా ప్రకారం చెల్లనేరదని పేర్కొంటూ ఆ తండ్రి పేరప్పుడు ఆస్తి యావత్తు ఒకే కుటుంబం క్రింద లెక్కలు చూపారు. అటువంటివారు ఇప్పుడు తమ భూములు వారి ఇష్టంపై తమ మేజరు కుమారులకు, కుమార్తెలకు వ్రాసి ఇచ్చేశారు కూడా చెల్లదని చెబుతున్నారు. కాని ఆ అర్జీలు పిల్లలు తాండియాలే ఏ విధమైన వ్రాతకోతలు లేనప్పటికి మేజర్ వాటాలు ఎవరివాటా వారికి విభజించి లెక్కలు వ్రాస్తున్నారు.

హిందూ లా ప్రకారం స్వార్జితంవారు లస్టి అటువంటి ఆస్తిగల తండ్రి ఇష్టవాణికి ఇష్టపడితే అతని సంతరికి చెందవానికి అభ్యంతరం వుండకూడదు.

ఇక్కడి రెవిన్యూ అధికారులు లెక్కలు వ్రాసినట్టుగానే అమలుకూడా జరిగితే స్వార్జితంవారు భూములుగల తండ్రికిగల మేజరు కుమారులు, వారి పిల్లలు ఛిన్నభిన్నపరచబడిన పరిస్థితి ఏర్పడుతుంది.

తండ్రి ఆస్తి అతని కుమారులకు ఇష్టంలేని ఇప్పుడు కూడా చెల్లబడడం చాలా అన్యాయంగా ఉన్నది.

అటువంటి ఆస్తిగల తండ్రులు వారి సంపూర్ణ అనుమతితోనైనా అతని మేజరు పిల్లలకు గరుపు ఆస్తి ఇవ్వడం అని చెల్లుబడి అయేట్టు చూడడం న్యాయంగా వుండగలదు.

ప్రస్తుతం భూ కమతాల చిన్న సెలట్ కమిటీకి నివేదించబడుతున్న దృష్ట్యా ఆ కమిటీవారు, ముఖ్యమంత్రి ఈ విషయాన్ని పరిశీలించి ఈ ఉపరూపించిన దాపరు స్వార్జితం దాపరు ఆస్తులుగల తండ్రులయందున్న మేజరు పిల్లలకు అన్యాయం జరుగకుండగా చూడవలసినదిగా కోరుచున్నాను.

కె. వి. రామారావు,
ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా.

రాశిఫలం

9–8–1972 బుధవారము

1894 శక శ్రావణ 18

రాహుకాలం ప 12–00 ల 1–30 వర్జ్యం ప 12–02 ల 1–37

యమగండం ఉద 7–30 ల 9–0 రాత్రి 12–0 ల 1–30

దుర్ముహూర్తం ప 11–48 ల 12–30

తిథి: అమావాస్య ప 10–55 ఆశ్లేష రాత్రి 11–4 నుప తీలము. ధరలు నిలకడలేమి. దైనిక కార్యములు కుదరవు. ప్రయాణం సామాన్య ఫలం.

ఈనాడు జన్మించినవారు శరీర సౌష్టవము కలవారై దేశ సంచారము చేయుచుందురు. పరదేశములో పేరు ప్రఖ్యాతులు పొందుదురు.

మేషం: ప్రయాణం అసౌకర్యం. విద్యలో హెచ్చుదనం. చిత్తచంచలం అనారోగ్యం. భార్యతో వివాదం.

వృషభం: ధనలోపంలేదు. అదృష్టము. ప్రయాణం యందు సుముఖత. ధనాదాయవృద్ధి. ప్రయాణంలాభదాయకం. వృత్తి, ఉద్యోగాలలో ప్రోత్సాహం. ఆస్తి సంబంధ వివాదం.

మిథునం: కుటుంబ పరిస్థితులు మనస్పర్థాంతిదెరచును. నూతన బాధ్యతలు స్వీకరించి బాధపడవలసివచ్చును. గృహ సంబంధ సమస్యలు ప్రాధాన్యత వహించును. ధనలోపం హెచ్చు. ప్రయాణం నిరుపయోగం.

కటకం: కుటుంబకాంతి తక్కువ. ప్రయాణం నిరుపయోగం. ఆస్తి సంబంధ వివాదం. దైనిక కార్యములు చేపట్టవలయును.

సింహం: అశుభమైన కాలం. దైనిక కార్యములు చేపట్టుట సుఖం. ప్రధాన సమస్యలు వాయిదావేయుట సుఖం.

కన్య: కుటుంబ సుఖం హెచ్చు. ప్రయాణం ఉపయోగం. వ్యాపారంలో లాభం. ప్రతిపనియందు కష్టనష్టములు మిశ్రమము. కొన్ని పనులందైనా విజయంతప్పదు.

తుల: కుటుంబంలో శాంతి. ప్రయాణ

"అనావృష్టి పరిస్థితిపై రైతులు యుద్ధాన్ని సాగించాలి"

మెట్టప్రాంతాలలో పైర్లను కాపాడే పద్ధతులు సూచిస్తూ వ్యవసాయ శాఖాధిపతి వివరణ

వర్షాలు రాగానే నాట్లు వేయడానికి సమాయత్తం కావాలని ఉద్బోధ

హైదరాబాద్, ఆగస్టు 8—

దుర్భిక్ష పరిస్థితులను ఎదుర్కొనడానికి రైతులకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ కొన్ని సూచనలు చేశారు.

విత్తనంవేసిన చేనులో కలుపుతీసూ, మధ్య దున్నడం సాగిస్తే, వర్షం కురవగానే మొక్కబాగా పెరుగుతుందని ఆయన చెప్పారు. వాటిలోపాటు మొక్కలకు చీడపురుగు పట్టకుండా చర్యలు గైకొనాలని ఆయన అన్నారు.

ఒక్కొక సందర్భంలో ఎంత కృషిచేసినప్పటికి మొక్కలు దెబ్బతినవచ్చునని. అటువంటప్పుడుకొన్నిమొదరై నవాటికితిరిగి ఆచే విత్తనం వేయడానికి బదులు సజ్జవేసే దుర్భిక్ష పరిస్థితులకు బాగా నిలవి వుండగలదని ఆయన చెప్పారు.

అయితే, వేరుశెనగ విత్తనం వేసినచోట అచే విత్తనం తిరిగి వేయడం కుదరదని. అటువంటి పరిస్థితులలో ప్రొద్దు తిరుగుడు పంట వేయడం మంచిదని ఆయన సలహా ఇచ్చారు.

చాలచోట్ల రైతులు దున్నడం, విత్తనం వేయడం ప్రారంభించలేదని, అటువంటి సందర్భంలో వర్షాలువచ్చే లోపల దున్నడం పూర్తిచేయడం మంచిదని ఆయన చెప్పారు. వారు విత్తనంతోపాటు ఎరువులు వేయడం మంచిదని కూడా ఆయన వివరించారు.

ఆంధ్రప్రదేశ్ భూములలో ఫాస్ఫేట్ తక్కువ అని, అందువల్ల యూరియా, సల్ఫేట్‌తో తృప్తిచెందక నైట్రోజన్ ఫాస్పరస్, అవసరమైన చోట పొటాష్ వాడడం అవసరమని ఆయన అన్నారు.

విత్తనంతో ఎరువులు వేసిన భూములలోని పంట ఎరువులు వేయని భూములలో కంటె బాగున్నదని ఆయన అన్నారు.

సాయంత్రం మొక్క వడిలిపోయినట్టు కనపడితే ఫరవాలేదు కాని ఉదయం వడిలిపోతే ఈ పంట దెబ్బతింటుందని ఆయన చెప్పారు. అందువల్ల చీడపట్టకుండా చూడడం చాల అవసరమని ఆయన అన్నారు. కొద్దిగా వ్యయమయినా ఇలా చేయడం చాలా మంచిదని డైరెక్టరు చెప్పారు.

కొన్ని ప్రాంతాలలో ఆకుతెగులు, చీడపురుగులు వేరుశెనగ పంటలకు పట్టవచ్చు. అటువంటిని కష్టమైనామొక్కరక్షణ చర్యలు గైకొనడం అవసరం. ఇతర పుగులకు సంబంధించి కూడా ఇలానే చేయాలి.

భూసారం లోతుగా లేనిచోట మొక్కలు త్వరగా ఎండిపోతాయి. అటువంటి సందర్భంలో తిరిగి విత్తనం చేయడం అవసరం. అటువంటి అవసరాలకు ఇప్పటినుంచే సిద్ధపడి వుండడం ప్రధానం.

విత్తనం సరిగా నాటి మొక్కలను సరిగా పెంచడం ముఖ్యమని ఆయన అన్నారు.

ప్రొద్దుతిరుగుడు పూవు, సజ్జ పశుగ్రాసానికి పనికిరాదని అంటాడు. అయితే ఇప్పుడు రైతులు పశుగ్రాసం కోసమే చూస్తారు. అదాయం, ఎక్కువదిగుబడికోసం చూడాలి. పప్పుగడ్డి చేతగా ఉపయోగించవచ్చునని ఆయన చెప్పారు. ప్రొద్దుతిరుగుడు మొక్క పైభాగంకూడా పశుగ్రాసానికి పనికివస్తుంది.

తిరిగి విత్తనం వేయడానికి, అవసరమైనవి తనాలను సిద్ధంగా వుంచుకొనడంలో రైతులు కొంత వ్యయానికి వెనుదీయరాదు. ఈ సందర్భంలో విత్తనాలకోసం డిపార్టుమెంట్‌వారు ఇచ్చే బుణాలను ఉపయోగించుకొనవచ్చు.

ఇప్పటికే విత్తనంవేసి, ఎరువులు వేసి వున్న ప్రాంతాలలో మొక్కలకు ఎరువు అందింపడం అవసరం. ఎరువులు ఎక్కువ వేయడం మంచిది.

అరుణఅముదం విత్తనాలు వర్షాలు లేకపోయినా వేయవచ్చు. వర్షాలు పడిన తరువాత మొక్క దానంతట అదే పుట్టక వస్తుంది. దీనివల్ల రైతుకు సమయం కలిసి వస్తుంది.

రైతులు వర్షపు నీరు నిల్వచేయడానికి తమ పొలాలలో చిన్న చిన్న కట్టలు వేయవచ్చు. ఇప్పటికే విత్తనం వేసిన పొలాలలోకూడా ఈ పని చేయవచ్చు.

దావులకింద వ్యవసాయం జరిగే ప్రాంతాలలో దావులలో నీరు వుండకపోవచ్చు. నీటి కొరతవల్ల మొత్తం పంట దెబ్బతినకుండా చూడాలి. మొత్తం పంట కోసం ఆశపెట్టుకొనకుండా నీరే అందగల వరకు పంటపండించడానికి ప్రయత్నించాలి.

వర్షాలు పడేవరకు మాత్రమే సరిపోయే నీరు వున్నచోట మొక్కలు ఎండిపోతున్న తరుణంలో నీరు నష్టాలు చేయడం ప్రారంభించాలి. నీరు వృథా కాకుండా కంద్రాలు చేయడం మంచిది.

పరిసాగు చేసే రైతులు నాట్లు వేయక ముందే పొలాన్ని సమతలంచేసి నాట్లువేసి వుంటే నీరుఎక్కువ వృథాకాకుండావుండవచ్చు. వరి పైరుకు రెండునుంచి మూడు అంగుళాల నీరు వుంటే చాలు. కొన్ని సందర్భాలలో నీరుఎల్లప్పుడు వుండడంకూడా మంచిది కాదు. ఒకటి రెండు అంగుళాల కంటే నీరు వుండడం వృథాయే అవుతుంది.

నీరు తక్కువగావున్న చెరువుల కింద భూములలో ముందుగా గొర్రుతో దున్నడం మంచిది. మొక్కలు వెడల్పుగా వేయాలి.

ప్రస్తుత పరిస్థితులలో స్థానిక రకం విత్తనాలు బాగా పనిచేయవు. అందువల్ల అవి ఎక్కువ దిగుబడి నియ్యవు. అటువంటపుడుఒకనిర్ణీతవ్యవధిలో పెరిగే అధికోత్పత్తి విత్తనాలను వాడడం మంచిది.

ఆలస్యంగా నాట్లువేసిన చోట్ల అన్ని జాగ్రత్తలు తీసుకొనాలి. ఎరువులువేయడం పూర్తిగా మొక్కల రక్షణకు చాలా అవసరం. దానిమీద ఖర్చుపెట్టిన దానికి తగిన ఫలితం వస్తుంది.

ఇటువంటి పరిస్థితులలో అందరు నారు పెంచడం సాధ్యం కాకపోవచ్చు. అటువంటప్పుడు ఒక సమష్టి ఏర్పాటుచేసుకొనడం అవసరం.

నాట్లు సక్రమంగా ఒక పద్ధతి ప్రకారం వుండాలి.

కొన్ని సందర్భాలలో రైతులు ఒకభాగంలోనే నాట్లువేసివుండవచ్చు. మిగిలినప్రాంతాలలో నాట్లు వేయడానికి నీరుచాలకపోవచ్చు. అటువంటపుడు మొత్తం భూమిలో నాటిన మొక్కలలో కొన్నిటినే పీకివేసి తిరిగి నాట వచ్చు.

దావులకింద మెట్టపంటలు వేసేటపుడు మొత్తం సాగుచేయడానికి మూడు నాలుగు రోజులుపట్టవచ్చు. అటువంటపుడు ప్లాటుగా తీసుకొని ఒకప్లాటుతరువాత ప్లాటు విత్తనం వేసుకోంటూపోవాలి. ఇది పద్ధతి ప్రకారం జరగకపోతే ముందువేసినపంట ఎండిపోయే ప్రమాదం వుంటుంది. అందువల్ల తడి సరిగా పుంచేటట్టు చూడాలి.

దావిలో తగినంత నీరులేనప్పుడు అవసరమైనంత వరకే నీరు సరఫరా చేయాలి. వర్షాలు లేనపుడు ఎక్కువ నీరు వినియోగించుకొనడానికి అవకాశం ఏర్పడుతుంది.

నీరు అనవసరంగా వృధా కాకుండా జాగ్రత్తగా చేసుకోవాలి.

నీరు తక్కువగా వున్న చెరువుల క్రింద పొలాల విషయంలో నీరు ఎక్కువగా వృధా కానివ్వరాదు. అటువంటి సందర్భాలలో స్ప్రాయిస్ తెరవడం మూయడం జాగ్రత్తగా చేయాలి. రాత్రిపూట నీరు పోనివ్వకూడదు. స్లూయిస్‌లకు దగ్గరగా నాట వేయాలి. ఒక కాలక్రమాన్ని అనుసరించి నాట వేయాలి. చెరువులకు దూరంగా వుండే భూములలో తక్కువ వ్యవధిలో కోతపనచ్చే పైరు వేయాలి.

సాగునీటికి, దుక్కిగునీటికి చేదువేసే కాలవలుండాలి. దుక్కిగు నీటికి ఎక్కువగా పోకుండా చూడాలి. వరి శాతం నీరు పొదుపుచేసిన దానివల్ల మంచి ఫలితాలు వుంటాయి.

గట్లు మీద కంది, అముదంవంటి మొక్కలు వేయాలి. గట్లు పెద్దవయితే కొబ్బరి మొక్కలు కూడా వేయవచ్చు.

చెరువుకు దూరంగా భూములుగల రైతులకు దావులుండడం అవసరం. సమయానికి ఉపయోగపడతాయి.

జాయింట్ సెలెక్టు కమిటీచే భూ సంస్కరణల చట్టంపై అభిప్రాయాల సేకరణ

హైదరాబాద్, ఆగస్టు 8— ఆంధ్రప్రదేశ్ భూసంస్కరణల చట్టం (వ్యవసాయ కమతాలపై పరిమితి), జాయింట్ సెలక్టు కమిటీ అసెంబ్లీ భవనాలలోగల తన కార్యాలయంలో ఈ నెల 11 వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంటవరకు బిల్లుపై వచ్చే లిఖితపూర్వకమైన విజ్ఞప్తులను స్వీకరిస్తుంది.

చట్టంపై అభిప్రాయాన్ని వ్యక్తులు, సంస్థలు తమ నిజ పేరులను రిజిస్టేషన్ కార్యదర్శికి లేదా కమిటీకి సమర్పించవచ్చును.

ప్రప్రథమంగా విద్యార్థులచే కళాశాల నిర్వహణ

త్రివేంద్రం, ఆగస్టు 8— దేశంలో మొట్టమొదటిసారిగా, పూర్తిగా విద్యార్థులచే నిర్వహించబడే "విద్యార్థుల కాలేజి" రేపు కేరళలోని రాష్ట్రహోం శాఖ మంత్రి శ్రీ కె. కరుణాకరన్ ప్రారంభిస్తారని నేడు ఒక ప్రకటనలో తెలియజేశారు.

రాష్ట్రంలో మెజారిటీ ప్రైవేటు కళాశాలలు మూసివేయబడివున్న దృష్ట్యా ఉన్నత విద్యను నిర్వహించడానికి తీసుకున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా ఈ కళాశాలను నెలకొల్పుతారు.

కాంగ్రెస్‌లో స్వతంత్రపార్టీ ప్రముఖుల చేరిక

బాపట్ల తాలూకాలో

నిడుబ్రోలు, ఆగస్టు 8— గుంటూరు జిల్లా బాపట్ల తాలూకాకు చెందిన పదముగ్గురు ప్రముఖ స్వతంత్రపార్టీ సభ్యులు కాంగ్రెసులో చేరాలని నిశ్చయించారు. ఈ విషయాన్ని బాపట్ల మునిసిపల్ చైర్మన్ శ్రీ వై. సూర్యనారాయణ ప్రకటించారు.

శ్రీ సూర్యనారాయణతోపాటు స్వతంత్రపార్టీనుంచి నిష్క్రమిస్తున్నవారిలో బాపట్ల మునిసిపల్ కౌన్సిలర్, బాపట్ల పట్టణ స్వతంత్రపార్టీ అధ్యక్షులు, స్వతంత్ర పార్టీ బాపట్ల నియోజకవర్గ శాఖ కార్యదర్శి వున్నారు.

ప్రధానితో రాష్ట్ర కార్మికమంత్రి చర్చలు

కార్మిక సమస్యలపై

హైదరాబాద్, ఆగస్టు 8— రాష్ట్రంలో సాధారణ సమస్యలు, ముఖ్యంగా కార్మిక సమస్యలగురించి కార్మికశాఖ మంత్రి శ్రీటి. అంజయ్య నిన్న ప్రధానితో చర్చలు జరిపారు. ఆయనవెంట పార్లమెంటు సభ్యుడు శ్రీ జి. వెంకటస్వామి కూడా వున్నారు.

శ్రీ అంజయ్య, కేంద్ర కార్మిక మంత్రి శ్రీ ఖాడిల్కర్‌ను కూడా కలుసుకున్నారు.

అయిదు సంవత్సరాల వరకు పరిశ్రమలలో సమ్మెలు, లాకౌట్లపై మారటోరియం పొడిగించాలన్న రాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి సూచనను మంత్రి ఆహ్వానించారు.

సెప్టెంబర్ నెలకు చక్కెర కోటా

న్యూఢిల్లీ, ఆగస్టు 8— సెప్టెంబర్ నెలకు ఫ్యాక్టరీలనుంచి మూడు లక్షల టన్నుల చక్కెర విడుదలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

దానిని చౌక చక్కెరగా, స్వేచ్ఛా మార్కెట్‌లోను అమ్ముతారు.

ఈ చక్కెర విడుదల ఉత్తరువు సెప్టెంబర్ ఒకటినుంచి 30 వరకు అమలులో వుంటుంది.

ప్రభుత్వ యాజమాన్యానగల హిందూస్థాన్ యంత్ర పరికరాల ఫ్యాక్టరీ చెయిర్మన్ శ్రీ ఎస్. ఎం. పాటిల్ ఆగస్టు ఏడవ తేదీన హుట్టూరుతూ, ఉద్యోగావకాశాలను పరింతగా కల్పించడంలో పబ్లిక్ రంగం తమ పాత్ర నిర్వహించవలసివుందని పేర్కొన్నట్టు కొచ్చిన్ వార్త.

అంగారక గ్రహంలో వసంతఋతువు రావడంతో హిమచ్ఛాదనం (ఐస్‌క్యాప్) తగ్గిపోతున్నది. దీన్నిబట్టి అక్కడ నీరు వుండి వుండవచ్చునని శాస్త్రజ్ఞుల ఊహ

చేనేత పరిశ్రమకు కొన్ని వస్త్రాల కేటాయింపు

బిల్లు ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం యోచిస్తున్నట్టు కేంద్ర మంత్రి వెల్లడి

విజయవాడ, ఆగస్టు 7—

చేనేత పరిశ్రమకు పత్తి ఉత్పత్తుల రేటాయింపు విషయంలో చట్టాన్ని తీసుకొని వచ్చే ప్రతిపాదనను కేంద్రప్రభుత్వం పరిశీలిస్తున్నదని విదేశీ వాణిజ్య శాఖ మంత్రి శ్రీ ఎల్. ఎన్. మిశ్రా చెప్పినట్టు శ్రీ ప్రగడ కోటయ్య ఒక ప్రకటనలో వెల్లడించారు.

మిల్లులు దుర పగ్గాలు, రంగు చీరలు ఉత్పత్తి చేయడంతో నిరోధించడానికి తాము రూపొందించిన ఉత్తర్వులను వాటి యజమానులు ఖాతరుచేయనట్టు దుర్రాష్ట్రి మొదలైన కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తెలియచేసిన కారణాన కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ప్రతిపాదన గురించి యోచిస్తున్నట్టు కేంద్ర మంత్రి తెలిపారని అయన పేర్కొన్నారు.

కేంద్ర విదేశ వాణిజ్య వ్యవహారాల మంత్రి శ్రీ మిశ్రాను రాష్ట్ర చేనేత కాంగ్రెస్ తరపున ఒక ప్రతినిధి బృందం గత శనివారం ఢిల్లీలో కలుసుకొని ఆంధ్రప్రదేశ్‌లోను దేశంలోని ఇతర ప్రాంతాలలోని చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు. ఇబ్బందులను వివరించారన్నారు.

నూలు దైలు, కెమికల్స్ తదితర ముడి పదార్థాల ధరలు బాగా పెరిగిపోయిన కారణాన చేనేత కార్మికులు ఇబ్బందులకు లోనవుతున్నారని ప్రతినిధిబృందం సభ్యులు కేంద్ర మంత్రికి తెలిసినట్టు శ్రీ ప్రగడ కోటయ్య పేర్కొన్నారు.

చేనేత పరిశ్రమ విషయంలో కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న సహాయ నిరాకరణ వైఖరి గురించి కేంద్ర మంత్రి దృష్టికి వారు తెచ్చారన్నారు.

కేంద్ర మంత్రి శ్రీ ఎస్.ఎన్. మిశ్రాను కలుసుకున్న రాష్ట్ర చేనేత కాంగ్రెస్ ప్రతినిధివర్గంలో తనలోపాటు పార్లమెంటు సభ్యుడు శ్రీ సందా నారాయణప్ప తదితర ప్రముఖులు వున్నట్టు శ్రీ ప్రగడ కోటయ్య ప్రకటనలో తెలియచేశారు.

కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాల స్థాయికి తమ జీతాలను పెంచాలన్న కోరికను సాధించుకొనడానికి ఆగస్టు 19 వ తేదీన నిరసన దినోత్సవం జరుపవలసిందిగా మైసూరు రాష్ట్రంలోని రెండున్నర లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు నాన్-గజెటెడ్ ఆఫీసర్ల సంఘం విజ్ఞప్తి చేసినట్టు బెంగుళూరు వార్త.

బొంబాయిలో మృతి చెందిన కుటుంబం

ఇప్పటికీ ఇదమిత్థంగా వివరాలు తెలియని స్థితి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— బొంబాయి హోటల్‌లో ఆత్మహత్య చేసుకున్నట్టు చెప్పబడుతున్న కుటుంబానికి సంబంధించి వివరాలు ఇప్పటికీమీ తెలియరాలేదు.

ఆ కుటుంబానికి సంబంధించి ఎమ్. ఎస్. రావ్ సాగర్‌రోడ్డు, హుచర్ల అన్న చిరునామా హుచర్లలో లభించలేదని హుచర్ల పోలీసులు చెప్పారు.

వాళ్ళు అంతకు వెంటనే ఇక్కడి పోలీస్ అధికారులు దర్యాప్తు జరిపించడం నిజమైన గుంటూరు పోలీస్ సూపరింటెండెంట్‌కు తెలియజేశారు. హుచర్లలో పోలీసులు దర్యాప్తుచేసి. అట్టి కుటుంబంగురించి హుచర్లలో మీకు తెలియలేదని చెప్పారు.

ఇంతవరకు ఎట్టి సమాచారం తెలియనప్పటికి పోలీసులు ఇంకా దర్యాప్తు కొనసాగిస్తున్నారని పోలీసు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

బంగ్లాదేశ్ గుర్తింపుకు భుట్టోకు అనుమతి

పాక్ జాతీయ అసెంబ్లీకి కరాచీ పత్రిక విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 8— బంగ్లాదేశ్‌ను గుర్తించడానికి ప్రెసిడెంట్ భుట్టోకు అనుమతి నివ్వాలని కరాచీ దినపత్రిక "డాన్" జాతీయ అసెంబ్లీని కోరింది.

గుర్తింపుకు సంబంధించిన వివరాలను రహమాన్‌తో చర్చించడానికి భుట్టోకు అనుమతి నివ్వాలని కూడా పత్రిక సూచించింది.

పద్మశాలీ సహకార గృహనిర్మాణ సంస్థ

ఆగస్టు 14 వ తేదీన కార్మికమంత్రిచే ప్రారంభం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— పద్మశాలీ సహకార గృహ నిర్మాణ సంస్థకు, కార్మిక మంత్రి శ్రీ టి. అంజయ్య ఆగస్టు 14 వ తేదీన ప్రారంభోత్సవం చేస్తారు.

మునిసిపల్ పరిపాలనా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీ ఎం. హనీక్‌రావు, ఈ సందర్భంగా హాజరుకానేడు దేవాలయానికి శంకుస్థాపన చేస్తారు.

సహకార శాఖ మంత్రి శ్రీ బి. సుబ్బారావు ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా వస్తారు. సహకార గృహనిర్మాణ సంస్థల సమాఖ్య చెయిర్మన్ శ్రీ ఎ. విశ్వనాథం అధ్యక్షత వహిస్తారు.

హెచ్. ఎం. టి. చే తొలి ఆటోమాటిక్ ప్రింటింగ్ మెషిన్

సంస్థ చైర్మన్‌చే విడుదల

కొచ్చిన్, ఆగస్టు 7— ఇక్కడకు సమీపంలోని కలామస్సెరీవద్దగల హెచ్.ఎం.టి. తొలిసారిగా నిర్మించిన మిక్కిలి వేగంగా పని చేసే ఆటోమాటిక్ ప్రింటింగ్ మెషిన్‌ను సంస్థ చైర్మన్ శ్రీ ఎస్. ఎం. పాటిల్ నేడు ఫ్యాక్టరీ ఆవరణలో జరిగిన చిన్న ఉత్సవంలో విడుదల చేశారు.

తర్వాత ఆ యంత్రాన్ని పట్టణంలో ఒక ప్రచురణసంస్థ తీసుకుంది.

రు. 3.3 కోట్ల వ్యయంతో ఇటాలియన్ సాంకేతిక సహకారంతో ప్రచురణ యంత్రాల విభాగాన్ని పబ్లిక్ రంగంలో నెలకొల్పడం జరిగింది.

కలామస్సెరీలో మొదటి దశ పూర్తయ్యే సరికి సంవత్సరానికి 3.5 కోట్ల రూపాయల ప్రచురణ యంత్రాలు తయారు అవుతాయి.

హెచ్. ఎం. టి. తొలుత రెండురకాల ప్రచురణ యంత్రాలను తయారు చేస్తుంది.

మరో రెండు రకాల యంత్రాలను తయారు చేసే ప్రతిపాదన కూడ వుంది.

ప్రతిపక్షాల వాకౌట్

మహారాష్ట్ర అసెంబ్లీలో

బొంబాయి, ఆగస్టు 7— రాష్ట్రంలో సంభవించిన నాలుగు ఆకలి చావులపై ప్రతిపాదించిన మూడు వాయిదా తీర్మానాలను స్పీకర్ శ్రీ ఎస్. కె. పంఖెడే తిరస్కరించినందుకు నిరసనగా నేడు మహారాష్ట్ర అసెంబ్లీలోని మొత్తం ప్రతిపక్షాలు నేడు వాకౌట్ జరిపాయి.

ఆ నాలుగు చావులు సహజ మరణాలేనని పేర్కొంటూ రెవిన్యూ మంత్రి శ్రీ హెచ్. జి. పరిక్ ప్రకటన చేశారు.

అయితే రాష్ట్రంలో దుర్భిక్ష పరిస్థితి, పెరుగుతున్న ధరలను గురించి సభలో చర్చించగలమని స్పీకర్ అన్నారు.

ఆ చర్చకు తేదీని సలహా కమిటీ నిర్ణయిస్తుందన్నారు.

వాయిదా తీర్మానాలను జనసంఘ సభ్యులు శ్రీ ఆర్.కె. హల్లి, మరి ఇద్దరు ప్రతిపాదించారు.

ఉదరకోశ వ్యాధికి 20 మంది దుర్మరణం

ఒక్క గిద్దలూరుతాలూకాలోనే

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

గిద్దలూరు, ఆగస్టు 8— ప్రదేశం జిల్లా గిద్దలూరు తాలూకా అంతటా గాస్ట్రో ఎంటరైటిస్ (జీర్ణకోశ వ్యాధి) విపరీతంగా వ్యాపించి వున్నది.

ఇంతవరకు 20 మందికి పైబడి ఈ వ్యాధికి బలిఅయ్యారు. ఇంకా ఎందరో ఈ వ్యాధితో బాధపడుతున్నారు.

వాంతులు, విరేచనాలు,నరాలు తీసుకుపోవడంమొదలైన లక్షణాలు కనపడుతున్నాయి.

గ్రామీణులు ఇది కలరా అని భయపడుతున్నారు. అధికారులు ఇది గాస్ట్రో ఎంటైరిటిస్ అంటున్నారు.

ఈ జబ్బు ధోకానే హాస్పిటల్‌లో చెప్పిన వారు మాత్రం కోలుకుంటున్నారు.

జాతీయం చేసిన బ్యాంకుల కృషి

కాకినాడ సభలో సెంట్రల్ బ్యాంకు అధికారి వివరణ

కాకినాడ, ఆగస్టు 8— సెంట్రల్‌బ్యాంకు హైదరాబాదు గ్రూపు డివిజనల్ మేనేజరు శ్రీ ఎం. వి. గుప్తాని ఇటీవల ఇక్కడ జరిగిన ఒక సమావేశంలో మాట్లాడుతూ, బ్యాంకుల జాతీయకరణ జరిగిన తర్వాతనే సమాజంలోని ఉపేక్షింపబడిన వర్గాలవారికి బ్యాంకులుమంచి ఇతరిక సహాయం అందుతున్నట్టు రెలియచేశారు. రైతులకు బ్యాంకింగ్ సంస్థలు కల్పిస్తున్న పరిసర సౌకర్యాల గురించి వివరించారు.

తొలుత శ్రీ కర్మ సభ్యులకు స్వాగతం చెప్పారు. సమావేశానికి స్పెషల్ జి. డి. టి. శ్రీ ఎ. పనకాళస్వామి అధ్యక్షత వహించారు.

సమావేశంలో శ్రీయుతులు వి. సన్యాసిరావు, ప్రభాకరరావు లాంటి ప్రముఖులుకూడా ప్రసంగించారు.

విశ్వకరుణ నౌకకు బాగు సేత పనులు

నిర్మాణ సంస్థకు కార్మిక నాయకుల హామీ

విశాఖపట్టణం, ఆగస్టు 8— ఆగస్టు ఒకటవ తేదీన అన్నిప్రమాదాలకు గురియైన విశ్వకరుణ నౌకను దాన్లాంచేసిన గుడుపులోగా అప్పగించడానికిగాను అవసరమైతే అనవసరపనిచేసినదాగు చేయడానికి హిందుస్థాన్ నౌకానిర్మాణ సంస్థ కార్మిక నాయకులు హామీ ఇచ్చారు.

నౌకలో అత్యంత బరువైన యంత్రాలు, బాయిలర్స్ దెబ్బతినలేవని ధ్రువపడింది.

"ఎరువులు సక్రమ ధరకు అమ్మకపోతే సరకు స్వాధీనం"

—శ్రీ కాకాని హెచ్చరిక

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

విజయవాడ, ఆగస్టు 7—

ఎరువులను కంట్రోలుధరకు వర్తకులు సక్రమంగా రైతులకు విక్రయించకపోతే వారి వద్దనున్న సరకును స్వాధీనపరచుకొని వ్యవసాయశాఖ సిబ్బందిచే అమ్మించే ఏర్పాట్లు చేశామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం నేటి రాత్రి ఇక్కడ పత్రికాప్రతినిధులకు తెలియ చేశారు.

ఎరువుల రవాణాకు కూడా తగు చర్యలు గైకొంటున్నట్టు అయన చెప్పిడించారు.

శ్రీ కాకాని వెంకటరత్నం గుంటూరు, తెనాలి వర్తకుల సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు అమ్మివేయనిదిగాను లేని ఎడల కఠినమైన చర్యలు గైకొనగలమని హెచ్చరించారు.

గతనెల 28 వ తేదీనుంచి విజయవాడ ఫెర్టిలైజరు డీలర్స్ అసోసియేషన్ సభ్యులందరు ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు నిర్వహించడానికి నిర్ణయించారని, అయినా కొంతమంది అధిక ధరలకు విక్రయించినందున వ్యవసాయ శాఖ సిబ్బంది కొన్ని కొట్లను సోదాచేయడం జరిగిందని, ఒక కొట్టు యజమాని అమోనియంసల్ఫేట్ అధిక ధరలకు విక్రయిస్తుండగా పట్టుకొన్నట్టు, సరకును స్వాధీనపరచుకొన్నట్టు అయన చెల్లడించారు.

గుడివాడ, బందరు, పల్లపట్లి, ఉయ్యూరు గ్రామాలకు చెందిన కొట్లపై వ్యవసాయ శాఖ సిబ్బంది దాడులపై ఎరువులను అదుపులోనికి తెచ్చినట్టు అయన అన్నారు.

85.5 టన్నుల ఎరువులు స్వాధీనం

ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటె ఎక్కువ ధరకు అమ్ముడవుతుందని స్థానిక ఎరువుల వ్యాపారి వద్దనుంచి వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నెంకు రోజుల క్రితం సుమారు 85.5 మెట్రిక్ టన్నుల రసాయనిక ఎరువులను స్వాధీనం చేసుకొన్నారు.

అధ్యాపారుడు పట్టుకుంచి స్వాధీనం చేసుకొన్న ఈ మొత్తంలో 16.5 టన్నుల సరకును విజయవాడలోని ప్రభుత్వ వ్యవసాయశాఖగిడ్డంగులకు తరలించారు. మిగిలిన 69 టన్నుల ఎరువులు ఆంధ్రబ్యాంకి అధీనంలో ఉన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులకు తెలియ జేయకుండా ఈ సరకును విడుదల చేయవలదని బ్యాంకి అధికారులను కోరారు.

సినిమా ప్రకటనలు

తప్పక చూడండి !

కృష్ణ సమర్పించు
అయ్యప్ప పిక్చర్స్ వారి
పండంటి కాపురం
కృష్ణ, రంగారావు, గుమ్మడి,
ప్రభాకరరెడ్డి, జమున, దేవిక.
విజయనిర్మల, టి. సరోజాదేవి.

101 వ రోజు
జెమిని వారి
మంచిరోజులు వచ్చాయి
డైరెక్షన్: వి. మధుసూదనరావు
నాగేశ్వరరావు, కాంచన

ఉషశ్రీ వారి
మానవుడు-దానవుడు
శోభన్‌బాబు, శారద

రవిశంకర్ పిక్చర్స్ వారి
వేనకోడలు
డైరెక్షన్: బి. యస్. నారాయణ
కృష్ణ, జయప్ర



పాశ్చాత్య దేశాలలో "కృష్ణతత్వం"

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— అమెరికాలో కృష్ణతత్వం అనుసరిస్తూ, ఆతత్వ వ్యాప్తికొరకు పర్యటన చేస్తున్న వారిలో అయిదుగురు ఇటీవల భారత దేశంలో పర్యటిస్తూ, రెండు రోజుల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చారు.

ఈ సాయంత్రం, పత్రికా ప్రతినిధులతో సంభాషిస్తూ, భారతదేశంలోని దేవాలయాలను, మతాచార్యులను సందర్శించే ఉద్దేశ్యంతో తాము ఇక్కడకు వచ్చినట్టు తెలియజేశారు.

ఈ అయిదుగురిలో ఒకరు చైనా దేశీయులు. అయిదుగురూ 35 సంవత్సరాల వయస్సు లోపువారే. గత ఏడు సంవత్సరాల నుంచి "కృష్ణతత్వం" అనుసరిస్తున్నట్టు వారు తెలియజేశారు. వారు ముండిత శిరస్సులు, కాషాయాంబరధారులు, రుద్రాక్షమాలలు ధరించారు.

అమెరికాలో 'కృష్ణతత్వం' అంతర్జాతీయ సంఘాన్ని 1966 లో స్థాపించిన అమెరికా దేశీయుడు శ్రీమద్ భక్తివేదాంతస్వామి ప్రభుపాద 'శిష్యుల' మని వారు చెప్పుకున్నారు.

ఇతని శిష్యులుగా ప్రపంచమందంతటా ఎనిమిదివేల మంది వున్నారట. ఇందులో మూడువేల మంది అమెరికాలోనే వున్నారు.

పత్రికా ప్రతినిధుల సమావేశంలో సుబలదాస్ స్వామి, లలిత కృష్ణదాస్ బ్రహ్మచారి (చైనా), జయదేవాచార్య బ్రహ్మచారి, జైనకేతనదాస్ అధికారి (కెనడా), తెమల్‌కృష్ణస్వామి వున్నారు.

తమ సంస్థ తరపున అమెరికా, యూరప్, జపాన్ తదితర పాశ్చాత్య దేశాలలో ఇంతవరకు 105 కృష్ణ మందిరాలు నిర్మించినట్లు వారు తెలియజేశారు.

ఈర్ష్య, ద్వేషాలు, ఆర్థిక ప్రలోభాలు, రాజకీయ సమస్యలు, యుద్ధంతో విసిగెత్తిపోతున్న మానవులకు 'కృష్ణతత్వం' శాంతిని ప్రసాదిస్తుందనే నమ్మకం తమకు వున్నట్టు తెలియ జేశారు. 'హరే కృష్ణ' చరణాలను నంకీర్తనచేస్తూ వుండే, తదుకు అలౌకికానందం కలుగుతుందని వారు తెలియజేశారు.

తాము మాంసాహారం, త్రాగుడు, గంజాయి, టీ, కాఫీలు వంటి పదార్థాలు తీసుకొనడంలేదు, కేవలం శాకాహారులుగానే జీవిస్తున్నట్లు తెలియజేశారు. వివాహం అయినవారు "ఏకపత్నీవ్రతం" అవలంబించాలన్నది తమ నిర్ణయమని వారు తెలిపారు.

ఇవన్నీ అవలంబించేవారినే తమ గురువు, శిష్యులుగా చేర్చుకుంటారని వారు తెలియజేశారు.

భారతీయ సంస్కృతి, వేదాలు, ఉపనిషత్తులు, భారత, భాగవతాలు ఆంగ్లంలో చదువుకున్నాం. సంస్కృతం కూడ నేర్చుకుంటున్నట్టు వారు చెప్పారు.

భగవద్గీత వారి ప్రామాణిక గ్రంథం. వారికి అది కంఠోపాఠం.

వీ

కంబోడియాలో కొత్తగా గెరిల్లా దాడులు

అమెరికన్ బాంబర్ల ప్రతిఘటన చర్యలు

దక్షిణ వియత్నాంలో ఉత్తర ప్రాంతాలలో కమ్యూనిస్టులతో పోరు కొనసాగింపు

సైగాన్, ఆగస్టు 7—

దక్షిణ వియత్నాంలోని ఉత్తర ప్రాంతంలో తమ బాట్ పోస్టులపై ఉత్తర వియత్నాం, వియత్కాంగ్ దళాలు జరుపుతున్న దాడులను ప్రభుత్వ సైనికులు త్రిప్పి కొడుతున్నారని అమెరికన్, సైగాన్ మిలిటరీ సైనికవర్గాలు నేడు ప్రకటించాయి.

కంబోడియాలో కమ్యూనిస్టు దళాలకు మీటర్ల దూరానగల లోయాంగ్ రేవు పట్టణానికి 14 టాంకులను అమెరికన్ జెట్ విమానాలు తుడిచిపెట్టినట్టుకూడా ఆ వర్గాలు పేర్కొన్నాయి.

క్యాంగ్ట్రీ పట్టణాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో దక్షిణ వియత్నాం సైనికులు తీవ్రంగా నష్టపడడం జరిగింది. కమ్యూనిస్టు దళాలు వారిపై వెయ్యి రౌండ్లు కాల్పులు జరిపాయి.

ఉత్తర వియత్నాం రేవు పట్టణం హైఫాంగ్‌కు ఆరు కిలోమీటర్ల దూరంలో అమెరికన్ విమానాలు వేసిన బాంబులలో నల్లటి పొగతోకూడిన మేఘాలు అలాకాస్నం టాయని అమెరికన్ వర్గాలు తెలియజేశాయి.

హానోయికి 77 కిలోమీటర్ల వాయవ్యంగా చైనాకు వెళ్ళే రైలు మార్గంపైగల ఒక ప్రధానమైన బ్రిడ్జిలో మూడు భాగాలను అమెరికన్ విమానాలు కూల్చివేశాయి.

కంబోడియాలో ప్రభుత్వ దళాలు తొలిసారిగా ఎదుర్కొంటున్న కమ్యూనిస్టు ఫిరంగి దాడులనుంచి రక్షణ నిమిత్తం అమెరికన్ విమానాలు నిన్న, నేడు పెద్ద సంఖ్యలో ఎదురుదాడులు జరిపాయి.

సైగాన్‌కు 24 కిలోమీటర్ల ఈశాన్యంగా గల బిన్‌హా విమానాశ్రయం నుంచి దాడి జరిపిన ఈ అమెరికన్ విమానాలు, కంబోడియా సరిహద్దులో రష్యా నిర్మితమైన టి-54 టాంకులు 14 నాశనం చేసినట్టు అమెరికన్ సైనికవర్గాలు వివరించాయి.

కడచిన నాలుగు నెలలలో ఉత్తర వియత్నాం సైనికులు పెద్ద ఎత్తున టాంకులను నష్టపోయిన సంఘటనలో ఇది ఒకటి.

సైగాన్‌కు పశ్చిమంగా 136 కిలోమీటర్ల దూరంలోగల కంబోడియా పట్టణం కోహాంగ్‌ను ఆ టాంకులు చుట్టుముడుతుండగా అమెరికన్ విమానాలు వాటిని నాశనం చేశాయి.

దక్షిణ వియత్నాంలోని ఉత్తర మెకాంగ్ డెల్టానుంచి సప్లయిలు, సైనికుల రవాణా నిమిత్తం రోడ్లను స్వాధీనం చేసికోవడానికి ఉత్తర వియత్నాం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలుస్తున్నది.

హైఫాంగ్‌కు వాయవ్యంగా

రాష్ట్రంలో అనావృష్టి విలయతాండవం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

గిద్దలూరు. ఆగస్టు 8— ప్రకాశం జిల్లా గిద్దలూరు, మార్కాపూరు తాలూకాలలో కడచిన మూడు సంవత్సరాలలో ఏర్పడిన అనావృష్టివల్ల ఎండిపోయిన ఫలితంగా కొట్టివేసిన బత్తాయి తోటల రైతులకు ప్రభుత్వం సత్వరమే ధన సహాయం అందజేసి ఋణభారంతో నలిగిపోతున్న వీరిని ఆదుకొనవలసిందిగా జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులు శ్రీ భాస్కరరెడ్డి నేడొక విజ్ఞప్తి చేశారు.

ఒంగోలు—కర్నూలు బస్సు రూట్‌పై ప్రయాణంచేసే వారికి కన్నుల పండువుగా వుండే ఈ తోటలు, అగ్ని ప్రమాదానికి గురియై మాడిపోయిన చెట్లలాగా కనుపిస్తూ హృదయ విదారక దృశ్యంగా తయారైంది.

ఇతర పెట్ట వ్యవసాయాన్ని ఉపేక్షిస్తూ వచ్చిన రైతులు, తమ చేతులతోనే ఈ తోటలను కొట్టివేసుకుంటూ గుండె కూలి కూర్చున్నారు.

ఆహారధాన్యాలు

గిద్దలూరు తాలూకా పల్లెలలో నివసించే పేద ప్రజలు ఆహారధాన్యాలు లభ్యంకాక చాల కటకట పడుతున్నారు. కడచిన మూడు సంవత్సరాలుగా క్షామం ఏర్పడివుండంవలన రైతుల వద్ద ధాన్యంలేదు. గత సంవత్సరం తెరువబడిన చౌక డిపోలు బియ్యం సరఫరాలేక ఆరు నెలలక్రితం మూతపడినవి. చేసికొందామాఅంటే వీరికి పనులుకూడా లేవు. తిరిగి ఈసంవత్సరం కూడ అనావృష్టి ఏర్పడడంవల్ల వ్యవసాయపు పనులన్నీ స్తంభించి పోయాయి. కరువు పనులు కూడ ఇప్పుడు అమలులోలేవు.

ఈ అదను చూచుకొని గ్రామాలలోని వ్యాపారులుఆహారధాన్యాలధరలు విపరీతంగా పెంచారు. బియ్యం అక్కుళ్ళు కిలో రు. 1-60, జొన్నలు, సజ్జలు సేరు రు 1-50 అమ్ముతున్నారు.

పనులులేక కొనుగోలు శక్తిలేక పేద ప్రజానీకం నంద్యాల మాగాణి ప్రాంతానికి ప్రతినిత్యం వలసపోతున్నారు.

గిద్దలూరు తాలూకాలోని ద్రాక్షతోటల రైతుల పరిస్థితి కూడా ఇంచుమించు ఇలాగే వున్నది. ప్రూనింగ్ చేసే అక్టోబరు, నవంబరు నెలలలో కూడా వర్షాలుపడే ఈ ప్రాంతంలో రెండవ పంట దెబ్బతింటూ వచ్చింది. మొదటి పంట కూడా ఆశించినంతగా రాకపోవడంతో, పెట్టుబడికి తగిన ప్రతిఫలాలు రాక, రైతులు బాగా నష్టపడిపోయారు. మార్కెటింగ్ సౌకర్యాలు అంతగా లేక కూడా ఈ వ్యవసాయం దెబ్బతిన్నది. రైతులు నిరాశచెంది, తోటలు కొట్టివేసుకుంటున్నారు.

కిలో రూపాయి బియ్యం సరఫరా

పశ్చిమగోదావరి జిల్లాలో

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

ఏలూరు, ఆగస్టు 8— పశ్చిమ గోదావరి జిల్లాలో బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు కిలో రూపాయి చొప్పున బియ్యం సరఫరా చేసారు. పంచదార కార్డులపై ఈ బియ్యాన్ని ప్రారంభించబోయే 200 చౌక డిపోలద్వారా సప్లయి చేస్తారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. ఆర్. గోవిందరాజన్ వెల్లడించారు.

ఈ చౌక డిపోల సంఖ్యను త్వరలో రెట్టింపు చేయగలరని, ఈ డిపోలకు సప్లయిచేసే నిమిత్తం స్థానిక బియ్యపు మిల్లులనుంచి ముడి బియ్యాన్ని ప్రొక్యూర్ చేయడానికి ఏర్పాట్లు జరిగాయని కలెక్టర్ చెప్పారు.

పిల్లలకు పోషకాహారం

పాఠశాలలకు వెళ్ళే పిల్లలకు పోషకాహారం కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకొనున్నట్టు జిల్లా కలెక్టర్ శ్రీ ఎస్.ఆర్. గోవిందరాజన్ జిల్లా అధికారుల సమావేశంలో ప్రసంగిస్తూ చెప్పారు.

స్వాతంత్ర్య దినోత్సవంనాడు పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని సమితి కేంద్రాలలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్టు ఆయన వెల్లడించారు.

ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు వైద్య, ఆరోగ్య పరీక్షలు జరపడానికి ప్రస్తుతం తగినన్ని సౌకర్యాలు లేవని, ఈ విషయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన డాక్టర్ల సర్వీసులను వినియోగించుకొనున్నట్టు శ్రీ గోవిందరాజన్ చెప్పారు.

భారత స్వాతంత్ర్య రజతోత్సవాల ఏర్పాట్లను ప్రస్తావిస్తూ, ఈ నెలలో ఈ జిల్లాలో 150 సంక్షేమ పథకాలను ప్రారంభించనున్నట్టు ఆయన వెల్లడించారు.

కొత్తగూడెం సమితి

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

కొత్తగూడెం, ఆగస్టు 8— ఖమ్మం జిల్లా కొత్తగూడెం సమితి అధ్యక్షులు శ్రీ అన్నసముద్రం సీతారామారావు ఈకింది విధంగా తెలియజేశారు.

మొత్తం కొత్తగూడెం సమితిలో తిరిగి కరవు పరిస్థితులు ఏర్పడినాయి. గత నెల రోజులుగా వర్షాలులేవు మొదటపడిన వర్షాల వల్ల ఏ చెరువు కూడా నిండలేదు. నారుమళ్లు నాట్లుపడిన చేలు ఎండిపోయాయి. పశువులకు గ్రాసంలేకవచ్చడానికిసిద్ధంగావున్నాయి.

చౌక డిపోలను వెంటనే తెరవాలి. ఆ డిపోలకు సరఫరా తగినంతగా రావాలి. కరవు పనులు వెంటనే చేపట్టాలి.

బూర్గంపాడు సమితి

బూర్గంపాడు సమితి అధ్యక్షులు శ్రీ జక్కం సీతారామయ్య ఈకింది విధంగా తెలియజేశారు:

"ఈ సంవత్సరం వర్షాభావంవల్ల మొత్తం బూర్గంపాడు తాలూకాలో పూర్తిగా నాట్లు పడలేదు. నాట్లు ఏ కొద్ది ప్రాంతంలోనో నీరు లేక పూర్తిగా ఎండిపోయాయి. బావులలో క్రాంగేందుకు నీరు లేదు. పశుగ్రాసంలేక వందలాది పశువులు చనిపోతున్నాయి. నీరులేక ఎండిపోయే నారుమళ్ళను చూచి రైతులు కన్నీరు కారుస్తున్నారు. నిరాశానిస్పృహలతో భయాందోళన చెందుతున్నారు. గత సంవత్సరం కూడా ఈ ప్రాంతం క్షామానికి గురయింది. ఈ సంవత్సరం వర్షంలేక, చడిన కొద్ది పాటి వర్షంకూడా చాలక వ్యవసాయ పనులకు డబ్బు దొరకక రైతులు ముఖ్యంగా సన్నకారు వ్యవసాయదారులు వర్షంకోసం ఆకాశంవేపు చూడని రోజంటూ లేదు.

సాయం సమయంలోను, తెల్లవారుఝామున ఆకాశం మేఘావృతంఅవుతున్నది. కాని, ఒకటి రెండు జల్లులతో కన్నీరు తుడిచిపోతున్నది.

గత సంవత్సరం ఇదే విపత్కర పరిస్థితిలో ప్రభుత్వం అదుకున్నది. అలాగే ఈ సంవత్సరంకూడా ప్రభుత్వం వెంటనే ప్రతినిధులను పంపి క్షామ పరిస్థితులను అంచనా వేయించి రైతులకు ఋణసౌకర్యం, పశుగ్రాసం, చౌక డిపోలు ఏర్పాటువంటి కార్యక్రమాలను వెంటనే అమలుజరిపి ప్రజలను ఆదుకుంటుందని ఆశిస్తున్నాను."

ధరలను పెంచలేదుకాని....

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

విజయనగరం, ఆగస్టు 8— స్థానిక హోటళ్ళ యజమానులు తమ హోటళ్ళలో విక్రయించే పదార్థాల ధరలను పెంచితే ప్రజలలో తీవ్రమైన ఆందోళన పుట్టుందని ఉపాయంగా ప్రతి పదార్థం పరిమాణాన్ని సగానికి సగం తగ్గించివేశారు.

ఇడ్లీ, గారెలు, దోశె మొదలైనవి సగానికి సగంగా వండించి అమ్ముతున్నారు. తీపి వస్తువులను కూడా ఇలాగే అమ్ముతున్నారు.

చక్కెర లేని కాఫీ

కొన్ని హోటళ్ళలో కాఫీలో పంచదార వేయకుండా ఇస్తున్నారు. తరువాత దానిని త్రాగేవారు కోరితే ఒక చిన్న చెమ్చా చక్కెర వేస్తున్నారు.

అగస్టు 15 వ తేదీన స్వాతంత్ర్య దినం నాడు మహాత్మ, భారత్ భూమి పత్రికల, అఖిలభారత మానవసేవక సమాజ్ వార్షికోత్సవాలు సాయంత్రం 4 గంటలకు విజయ ట్యుటోరియల్ కాలేజిలో జరుగుతాయి. ఈ సందర్భంలో ఫిల్ముప్రదర్శన, సూత్రయజ్ఞం కూడా వుంటాయి.

విశాఖపట్నం జిల్లాలో నాట్లుపడని పరిస్థితి

చౌకగా బియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ శ్రీ అచంట వెల్లడి

విశాఖపట్నం, ఆగస్టు 8—

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ శ్రీ కె. బి. లాల్ రాష్ట్రంలో అనావృష్టి పరిస్థితి గురించి వ్యాఖ్యానిస్తూ మనం ఇప్పుడు ఇబ్బందులలో వున్నమాట నిజమేనని, అయితే వాటిని చూచి నిరాశ చెందవలసిన అవసరం లేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఆయన ఒక్కడ జిల్లా అధికారులతో ప్రొక్యూర్‌మెంట్ విధానం గురించి రెండు గంటలసేపు చర్చలు జరిపిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వర్షాలు కురవడం ఆలస్యమైనదని అయితే వచ్చే కొలదిరోజులలో వర్షాలుకురిసే పరిస్థితులలో కొంత మార్పు రావడానికి అవకాశం వున్నదని అన్నారు.

జిల్లా అధికారులను కలుసుకున్న రైతు ప్రతినిధులకు నాయకత్వం వహించిన శాసన సభ్యుడు శ్రీ కె.వి.వి. సత్యనారాయణ రాజు మాట్లాడుతూ నాట్లు పూర్తి అయిన పొలాలలోని పైరు మొక్కలు పూర్తిగా ఎండిపోయాయని వర్షాలు పడ్డప్పటికీ అవి పండుతాయన్న ఆశ లేదని అన్నారు.

విశాఖ జిల్లాలోని తాటిపూడి మినహా మరెక్కడ నాట్లు వేయలేదని జిల్లా కలెక్టరు శ్రీ ఎస్.ఎస్. అవంట తెలియచేశారు.

శ్రీ కె. బి. లాల్ (సివిల్ సప్లయిస్‌శాఖ కమిషనర్) మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాకు 11 వందల టన్నుల మంచిరకం బియ్యమును 18 వందల టన్నుల సన్నరకం బియ్యమును కేటాయించడం జరిగిందని, సన్నరకం బియ్యం నిల్వలను పరసమైన ధరలకు అమ్మడానికి ఏర్పాట్లు జరుగుతాయని వీటిధర బజారులో అమ్మే మంచిరకం బియ్యం ధరకన్నా చౌకగా వుంటాయని అన్నారు.

గత సంవత్సరం అనావృష్టి ప్రాంతాలలో ప్రారంభించిన సహాయ కార్యక్రమాలు ప్రోత్సాహకరంగా అమలు జరుగుతున్నాయని, వాటిని కొనసాగించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

అనావృష్టి ప్రాంతాలలోని బావులకు పూడికలు తీయించి వాటిని లోతుగా త్రవ్వడానికి అక్కడికక్కడే ఉత్తర్వులు జారీ చేయడం జరుగుచున్నదని శ్రీ లాల్ తెలిపారు.

రాష్ట్రంలో బఫర్‌స్టాక్ పరిస్థితిని పటిష్టం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర సహాయాన్ని కోరుతుందని ఇప్పుడు రాష్ట్రములో లక్ష టన్నుల ఆహారధాన్యాలు నిలువలో వున్నాయని శ్రీ కె. బి. లాల్ తెలియచేశారు.

శ్రీ కె. బి. లాల్ జరిపిన జిల్లా అధికారుల సమావేశంలో విశాఖపట్నం శ్రీకాకుళం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

నరసరావుపేట రోటరీక్లబ్ అధ్యక్షులు శ్రీ కె. వి. ఆర్. కృష్ణశర్మ

తాడేపల్లిగూడెం లయన్స్‌క్లబ్ కొత్త అధ్యక్షుడు శ్రీ చక్కా శ్రీమన్నారాయణమూర్తి

కృష్ణాజిల్లాలో 17 హరిజన వాడల విద్యుదీకరణ

భారతస్వాతంత్ర్యరజతోత్సవాలసందర్భంగా

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) బందరు, ఆగస్టు 8—

భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా, కృష్ణాజిల్లాకు చెందిన 17 పంచాయతీ సమితులలో ఒక్కొక్క హరిజన వాడను ఆగస్టు 15 వ తేదీన విద్యుదీకరించడానికి నిన్న ఇక్కడ జరిగిన జిల్లా సమన్వయ సంఘం సమావేశంలో నిర్ణయించారు. జిల్లా కలెక్టరు శ్రీ ఎస్. వి. గిరి ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఈ కింద పేర్కొన్న గ్రామాలకు చెందిన హరిజనవాడలకు విద్యుత్ సరఫరా చేస్తారు: తామరకొల్లు (కైకలూరు సమితి), పెదతుమ్మిడి (మండవల్లి), దొండపాడు (మోటూరు), వసుమత్త మాలపల్లి (అవనిగడ్డ). మంగినపూడి హరిజనవాడ స్త్రీ(బందరు), పతెనపాలెం (బంటుమిల్లి), వేటగాని మాలపల్లి (మొవ్వ), ధర్మవరప్పాడు (చిల్లకల్లు), నారాయణపురం మాలపల్లి (ఉయ్యూరు), వెల్లంకి (కంచికచర్ల), కనుమూరు (తిరువూరు), శ్రీరామపురం (విస్సన్నపేట),సింహాద్రిపురం (నూజివీడు), కేతనకొండ (మైలవరం), కేతవీరునిపాడు (నందిగామ), అరిగే రామస్వామినగర్ (కంకిపాడు), చన్నవల్లివారిగూడెం (గన్నవరం).

ఆగస్టు 14 వ తేదీ రాత్రి అన్ని విద్యా సంస్థలలోను సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆ తరువాత "పునరంకితం" ఉత్సవం జరుగుతుంది.

శుభ్రతను గురించిన ప్రచారం, వనమోత్సవ, జనవిద్య మొదలైన ప్రాజెక్టులను ఉన్నత పాఠశాలలు, పంచాయతీ సమితులు స్వాతంత్ర్య రజతోత్సవ సంవత్సరం పొడుగునా నిర్వహిస్తాయి.

నివేశన స్థలాలు కేటాయించడానికి, భూమిలేని కూలీల వివరాలను సేకరించడానికి కూడా నిర్ణయించడం జరిగింది.

ఉదరకోశ వ్యాధుల తాకిడికి వివిధ నిరోధక చర్యలను గురించి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్. చంద్రశేఖరరావు వివరించారు.

విద్యావంతులైన నిరుద్యోగులకుజిల్లాలో మంజూరుచేసిన వివిధ పథకాల అమలులో సమితి అధికారుల సహకారాన్ని పరిశ్రమల శాఖ డిప్యూటీ డైరక్టర్ శ్రీ బి. ఆర్. సోమయాజులు కోరారు.

ఆగస్టు 23 వ తేదీన ప్రతి మునిసిపాలిటీలోను, సమితుల కేంద్ర స్థానాలలోను, ప్రతి గ్రామ పంచాయతీలోను ప్రకాశం శత జయంతి ఉత్సవాలు జరుగగలవని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.

నూజివీడు తాలూకాలో దుర్భిక్షం—ముఖ్యమంత్రికి శ్రీ అప్పారావు విజ్ఞప్తి

హైదరాబాద్, ఆగస్టు 8—

నూజివీడు తాలూకాలో వున్న దుర్భిక్ష పరిస్థితుల దృష్ట్యా ఋణాలు, భూమిశిస్తు, సహకార బ్యాంకి ఋణాల వసూలు నిలిపివేయాలని శాసనసభ్యులు శ్రీ ఎం. ఆర్. అప్పారావు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

శ్రీ అప్పారావు నేడు ఉదయం శ్రీ పి. వి. నరసింహారావును కలుసుకొని తమ నియోజకవర్గం పరిస్థితిని గురించి వివరిస్తూ వెంటనే రిజుకొనవలసిన సహాయక చర్యలను సూచిస్తూ ఒక మెమొరాండం సమర్పించారు.

చెరువులకింద భూములలో నీరులేక మొక్కలు ఎండిపోతున్నాయని చెట్టుపంటలు విత్తనం వేయడానికే వీలుకావడంలేదని, విత్తనాలు వేసినచోట మొక్కజొన్న పేడ కొనగ మొక్కలు పూర్తిగా ఎండిపోయినవని ఆయన చెప్పారు.

పెద్దఎత్తున తక్కావి ఋణాలు మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. తాలూకాలో ప్రతి రెండు గ్రామాలకు ఒకటి అయినా చౌక దుకాణాలను తెరవాలని ఆయన కోరారు. భూములులేని పేదప్రజలకు ఉపాధికోసం దుర్భిక్ష నివారణ, ఇతర కార్యక్రమాలను ప్రారంభించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

కోటి రూపాయల ఖర్చుతో మంచినీటి బావుల త్రవ్వకం

—శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ వెల్లడి

శ్రీకాకుళం, ఆగస్టు 8—

శ్రీకాకుళంజిల్లాలో మంచినీటి బావుల త్రవ్వకానికి, తదితర పనులకు కోటి రూపాయలు ఖర్చు చేస్తారని జిల్లాకలెక్టర్ శ్రీ పురుషోత్తమనాయుడు నిన్న ఇక్కడ విలేకరులతో చెప్పారు.

ఆగ్రో- ఇండస్ట్రీస్, కార్పొరేషన్‌కు చెందిన అయిదు రిగ్గులను సూతుల త్రవ్వకానికి వినియోగిస్తారని ఉద్దానం ప్రాంతంలో పనులు చేపట్టడానికి 72 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని జిల్లాకలెక్టర్ తెలియజేశారు.

జీవితభీమా సంస్థ ఋణాలలో, అమదాలవలస, నరసన్నపేట, పాలకొండ, టీపుపర్తి, ఇచ్చాపురం పట్టణాలకు మంచినీటి సరఫరా పథకాలు ప్రభుత్వ పరిశీలనలో వున్నాయని శ్రీ పురుషోత్తమ నాయుడు చెప్పారు.

వ్యవసాయ కూలీలకు ఉపాధి సౌకర్యాలు కల్పించే నిమిత్తం కరవు పనులు చేపట్టడానికి, సన్నకారు రైతులకు తక్కావి ఋణాలు మంజూరు చేయడానికి 25 లక్షల రూపాయలు మంజూరు చేయవలసినదని ప్రభుత్వాన్ని కోరినట్టు ఆయన చెప్పారు.

జిల్లాలో పెక్కుచోట్ల తీవ్రమైన మంచి నీటికొరత ఏర్పడినట్టు శ్రీ పురుషోత్తమ నాయుడు వెల్లడించారు.

సోషలిస్టు ఫోరం అభ్యర్థన

ఖమ్మంజిల్లా కాంగ్రెసు సోషలిస్టు ఫోరం కార్యనిర్వాహక వర్గం సభ్యులు శ్రీ సాని కొమ్ము కాశిరెడ్డి ఈ కింది విధంగా తెలియచేశారు:

"ఖమ్మం జిల్లా గత సంవత్సరం కరవు రక్కసికి స్థానమయింది. రైతులు తాము తిన్న దెబ్బనుంచి ఇంకా కోలుకోనేలేదు. తిరిగి ఈ సంవత్సరం అదే పరిస్థితి. కాస్తో కూస్తో పండించిన రైతుల ఉత్పత్తులకే నిలుపు ధరలేదు. ఈ సంవత్సరం వర్షం ఆలస్యంగా అయినా ప్రారంభించి కొంత ఆశను అవిలో రేకెత్తించాయి. చెరువులలో కొద్దిగా నీరు చేరింది. నారుమళ్ళు పోశారు. నాట్లుకూడా కొన్ని చోట్ల పడినాయి. గత నెల రోజులుగా వర్షం లేనేలేదు. నారుమళ్ళు, నాట్లుపడిన చేలు ఎండిపోతున్నాయి. పెట్టుబడులు చెప్పనక్కరలేదు. సర్వనాశనం అయ్యాయి. రైతులకు అప్పులు పుట్టడం లేదు. పశువులకు గ్రాసంలేదు.

ధరలు ఇప్పటికే ఆకాశాన్నంటాయి. పరిస్థితిని అవగాహనం చేసుకొనని మంత్రుల ప్రకటనలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. వెంటనే ఈ జిల్లాను కరవు ప్రాంతంగా ప్రభుత్వం ప్రకటించి, ఆహారధాన్యాల సరఫరా, పశుగ్రాసం సరఫరా, ఋణాలు, చౌకడిపోలు ఏర్పాట్లుచేసి నిజమైన శ్రేయోరాజ్యం అనిపించుకుంటుందని ఆశిస్తున్నాను.

రావికమతం సమితి

పద్మాని, ఆగస్టు 8—విశాఖ జిల్లా రావికమతం సమితి ఉపాధ్యక్షులు శ్రీ బొండా వెంకటరమణ ఈ కింది విధంగా తెలియచేశారు:

"ఈ ప్రాంతంలో కడచిన ఆరు నెలల నుంచి వర్షాలు పడకపుండడం వలన గ్రామాలలో త్రాగే నీటికి ఎద్దడి ఏర్పడి ప్రజలు నీటికొరత చాలా అవస్థలు పడుతున్నారు. చోడి, గంజి, ఊడ, కొర్ర, పేడుశెనగ పంటలు వర్షాలు లేకపోవడంవలన పూర్తిగా ధ్వంసమై, ప్రజలు తిండిగింజలు లేక ఇబ్బందిపడుతున్నారు.

ప్రస్తుతం పనులు లేకపోవడం,బియ్యం కిలో రు. 1-50 నుంచి రు. 1-80 వరకు అమ్మడంవలన ప్రజలు తిండిగింజలు కొనలేక, పనులులేక పట్టణ ప్రాంతాలకు అధిక సంఖ్యలో వలసపోయే ప్రమాదం ఏర్పడినది.

సభలు — సమావేశాలు

విజయవాడ, ఆగస్టు 8— విజయవాడ హిందీ మహా విశ్వవిద్యాలయ వార్షికోత్సవం, హిందీ విజయ పత్ర వితరణోత్సవం రేపు సాయంత్రం 5 గంటలకు రామమోహన గ్రంథాలయం హాలులో శ్రీ వచ్చిపులను వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరుగుతుంది. ఈ సందర్భంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా వుంటాయి.

రాష్ట్రంలో అరవింద విశ్వవిద్యాలయం

కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 8—అరవింద విశ్వవిద్యాలయం అడ్‌హాక్ కమిటీ ప్రత్యేక సమావేశం శ్రీ పాటిబండ అప్పారావు అధ్యక్షతన ఇటీవల ఇక్కడ జరిగింది.

అరవిందుని జన్మదినమైన ఆగస్టు 15 వ తేదీలోగా ఆంధ్రప్రదేశ్‌లో అరవింద విశ్వవిద్యాలయం విషయంలో ఒక నిర్ణయం తీసుకొనవలెనని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు.

విజయవాడ పరిసర ప్రాంతాలలో ఈ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, ఇందునిమిత్తం డాక్టర్ సి. ఎల్. రాయుడు భూమిని ఇవ్వడానికి సిద్ధపడిన విషయాన్ని పరిశీలించాలని కేంద్రప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానాన్ని వీరు ఆమోదించారు.



విజయవాడ

గురువారం ఆగస్టు - 10

ఉ॥ 7-15 సంగీత శిక్షణ, 7-30 సంస్కృత పరిచయం, 7-45 వార్తా వ్యాఖ్య 8-20 మిరియాల వెంకటరత్నం: నాదస్వరం. మ॥ 11-45 పర్ అప్పర్ ప్రయిమరీ స్కూల్స్, 12-05 కె. సత్యవతి, 1-40 హైదరాబాద్ పలె, 1-10 పసిడిపంటలు, 1-20 చిత్రతరంగిణి, 1-30 మిరియాల వెంకటరత్నం: 2-10 చిత్రతరంగిణి, సా॥ 5-30 హైదరాబాద్ పలె, 6-15 గ్రామలక్ష్మి, 6-30 నవరస—ఉర్దూలో కార్యక్రమం, 6-45 చిత్రతరంగిణి, 6-55 కబుర్లు, 7-15 వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలు - ప్రసంగం, ధరలు వాతావరణం, 7-45 యువభారతిలో ప్రతిభావిద్యార్థి చదువుటయోగాక - ఇతరములైన పాఠశాల వనులలోను పాల్గొనాలి - ప్రసంగం, 8-00 పురవేధిక, 8-15 రేడియోస్కూల్ రీల్, 8-30 లలిత సంగీతం, 8-35 టుడే ఇన్ పార్లమెంట్, 9-15 లలిత సంగీతం, 9-30 నేటి మన గ్రామాలు (గత 25 సంవత్సరాలుగా మార్చుచెందిన మన గ్రామాలను చిత్రించే రూపకం), 10-15 కె. సత్యవతి.

హైదరాబాద్—ఎ

ఉ॥ 7-15 విజయవాడవలె 7-30 సంస్కృత పరిచయం 7-45 లలితసంగీతం 8-20 విజయవాడవలె మ॥ 11-45 విజయవాడవలె 12-05 వాద్యసంగీతం 12-20 హిందీ పాఠం 12-40 రెండు కుటుంబాల కథ-సీరియల్ నాటిక 1-10 చిత్రసీమ 1-30 గానసుధ సా॥ 5-30 మూడేటి మహేందర్: సితార్ 6-30 గ్రామలక్ష్మి — శ్రీల కార్యక్రమంలో గ్రామాభివృద్ధి -జనాభా సమస్య-చర్చ, కథానిక 7-15 ఇల్లూవాకిలీ 7-30 మీకుకోరిన పాటలు 8-00 ప్రసంగం 8-15 లలిత సంగీతం 8-30 జీవన ప్రమాణం పెంచడమెలా: ప్రసంగం 8-45 జానపద గేయాలు 8-45 లయ విన్యాసం 9-30విజయవాడవలె 10-15పమ్మ సోమేశ్వరరావు:వీణ.

హైదరాబాద్—బి

ఉ॥ 7-05 లలిత సంగీతం, 7-50 ఫర్ యూనివర్శిటీ స్టూడెంట్స్, 8-10 చిత్రసీమ, 9-00 మాటేటి మహేందర్ : సితార్, మ॥ 2-20 ఫిల్మిగానే, 2-30 ఉచ్చతర ప్రాథమిక పాఠశాలలకు (ఉర్దూ). 2-50 సుగం సంగీత్ సా॥ 5-30 కర్ణాటక సంగీతం, 6-40 ఫిల్మిగానే 7-05 హిందూస్థానీ సంగీతం, 7-20 భారతదర్శిని, 8-05 రాష్ట్రీయగీత్, 9-00 నైటింగ్, 9-30 సితార్.

మద్రాసు - ఎ

ఉ॥ 6-00 తుషిప్పాడల్‌గళ్, 6-35 సంగీతామృతం, 7-00 తమిళ్‌మనం, ఇళైపాడల్‌గళ్, 7-25 సంగీత సంజరి, 7-45 కె. ఆర్. లక్ష్మి, 9-04 చిత్రగానం, మ॥11-30 హాళ్యమిక పాఠశాలలకు,12-04 జి. కనకవల్లి :వమెలిన్, 12-30 పూనిలశెయిడిగళ్, 12-50 పెల్లికె. 1-04 చిత్రగానం, 1-30 కోవై మణి: గాత్రం, 2-10 వాద్యగోష్ఠి, 2-30 గాత్రం, 3-10 హాళ్యమిక పాఠశాలలకు, సా॥ 5-00 సంగీతం, 6-30 వాద్య సంగీతం, 6-45 చిత్రగానం, 7-30 వ్యవసాయదారులకు, 8-04 సంగీతం, 8-45 వాద్యసంగీతం, 9-15 సంస్కృత కార్యక్రమం, 9-30 రూపకం, 10-15 చిత్రగానం, 10-30 ఇన్నిశై.

మద్రాస్ - బి

ఉ॥ 6-55 మంగళధ్వని, 7-45 భక్తిగేయాలు, మ॥ 12-40 మద్రాసు ఎ పలె, సా॥ 6-40 మహిళా మండలి-శ్రీల కార్యక్రమం, 7-15 ఇలయ భారతం, 8-15 రేడియో స్కూల్ రీల్, 8-45 అంజలి, 8-25 టుడే ఇన్ ఇన్ పార్లమెంట్ 9-15 స్పాట్ లైట్, 9-30 పాశ్చాత్య సంగీతం.

అగ్నిబాధితులను ఆదుకోవడానికి "ఆంధ్రజ్యోతి" కృషి

చిలకలూరిపేట సాంస్కృతిక సంస్థ అభినందనలు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

చిలకలూరిపేట, ఆగస్టు 8— గుంటూరుజిల్లా చిలకలూరిపేట ఫ్రెండ్స్ కల్చరల్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఇక్కడి శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ కళ్యాణమండపంలో జరిగినది. సమావేశానికి సొసైటీ ప్రెసిడెంటు శ్రీ డి. చలపతిరావు అధ్యక్షత వహించారు.

ఆంధ్రప్రదేశ్ అగ్నిబాధితుల సహాయ నిధి సేకరణలో "ఆంధ్రజ్యోతి" వారు చేస్తున్నకృషిని సభ్యులు అభినందించారు.

అధ్యక్షులు శ్రీ డి. చలపతిరావు ప్రసంగిస్తూ ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టడంలో "ఆంధ్రజ్యోతి" ఎల్లప్పుడు ముందుగు వేస్తూనేవున్నదని, ఇకముందు కూడా ఇలాగే కృషి చేయగలదని ఆశిస్తూ, అగ్నికి సర్వం కోల్పోయి బాధపడుతున్నవారిపట్ల సోదర ప్రజలు వున్నారనే ధైర్యాన్ని వారికి కలిగించినందుకు ఆయన అభినందించారు.

చిలకలూరిపేట పట్టణ పౌరులు తమకు తోచిన విరాళాలను వెంటనే "ఆంధ్రజ్యోతి"కి పంపవలసినదిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

శ్రీయుతులు ఎల్.వి.ఎస్. హనుమంతరావు, సిహెచ్. వెంకటేశ్వర్లు, వి. రామచంద్ర మూర్తి కూడా ప్రసంగించారు.

సొసైటీ తరఫున విరాళాన్ని పంపడానికి అధ్యక్షులకి అధికారమిస్తూ తీర్మానించారు.

వ్యాస రచన పోటీ ఫలితాలు

"ఆంధ్ర కేసరి" శతజయంతి సందర్భంగా ఈ సంస్థ వారు నిర్వహించిన 'ప్రకాశం—సంఘసేవ' వ్యాసరచన పోటీలో సీనియర్స్‌లో మొదటి బహుమతిని బూరుగుపల్లి వ్యాసకృష్ణ (పసుపుల్రు), రెండవ బహుమతిని వక్కలంగడ్డ వీరరాఘవులుస్వామి (చీరాల), జూనియర్స్‌లో మొదటిబహుమతిని తవ్వా వెంకట రామశేషశాయి (చిలకలూరిపేట), రెండవబహుమతిని రాపూరి ప్రమీల (చిలకలూరిపేట) పొందారు.

విజేతలు 23 వ తేదీన ప్రకాశం శత జయంతి సందర్భంగా ఫ్రెండ్స్ కల్చరల్ సొసైటీ వారు జరిపే కార్యక్రమాలలో బహుమతులను ఇస్తారు.

బందరులో లారీ, రిక్షాడ్రైవర్ల కొట్లాట

11 మంది అరెస్టు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

బందరు, ఆగస్టు 8— మొన్న సాయంత్రం ఇక్కడ పాతరామన్నపేట వెంటరులో రిక్షాడ్రైవర్లు, లారీ డ్రైవర్ల మధ్య జరిగిన కొట్లాటలో నల్గురు రిక్షాడ్రైవర్లకు గాయాలు తగిలినాయని డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్ శ్రీ జి. పుల్లారెడ్డి నిన్న తెలియజేశారు.

రాబర్ట్‌సన్ పేట పోలీసుస్టేషన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీ బి. మురళి పోలీసు దళంతో వెళ్ళి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఈ సందర్భంలో 11 మంది లారీ డ్రైవర్లు, క్లీనర్లను అరెస్టుచేశారు. పోలీసు దర్యాప్తు జరుగుతున్నది.

దాడికి ఉపయోగించిన లారీని కూడా పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.

మండపేటకు మంచినీటి పథకం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

తాడేపల్లిగూడెం, ఆగస్టు 8— తూర్పుగోదావరి జిల్లా మండపేట పురపాలక సంఘంవారు చైర్మన్ శ్రీ వేగళ్ళ వీర్రాజు అధ్యక్షతన ఇటీవల సమావేశమై, పట్టణంలో మంచినీటి సరఫరా పథకాన్ని రు. 31.23 లక్షలతో ఏర్పాటుచేయడానికి, పథకం ప్రతిపాదనను చూచుటకు ల

కమతాల లెక్కల సేకరణలో దత్తత వెళ్లినవారి సమస్య

ముఖ్యమంత్రికి కొందరు శాసనసభ్యుల విజ్ఞప్తి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— వ్యవసాయ కమతాల అమలుకోసం ప్రస్తుతం రాష్ట్రంలో సేకరిస్తున్న కమతాల లెక్కల సేకరణలో దత్తత వెళ్లినవారిని, ఇల్లరికం పోయిన వారిని పాత కుటుంబంలో కాని, కొత్త కుటుంబంలో కాని, ఎందులోను చేర్చలేదని శ్రీయుతులు పి. ఉమారెడ్డి, జె. నరసింగరావు, జి. భూపతి ప్రభృతులు ఒక సావధాన తీర్మానం ద్వారా మొన్న శాసనసభలో ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు.

మామూలుగా దత్తత పోయిన వారిని 'మైనర్' అయితే కొత్త కుటుంబంలో చేర్చారని, 'మేజర్' అయితే, వివాహితుడైతే స్వయంగా ఒక కుటుంబ యూనిట్ లెక్కలలోకి, అవివాహితుడైతే వ్యక్తి లెక్కలలోకి, దస్తాదని ముఖ్యమంత్రి పట్టనే సమాధానమిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావు తెలిపారు.

ఇల్లరికం వచ్చి అతని భార్య ఒక వేరే కుటుంబం కిందికి వస్తారని కనుక, అతనిని కొత్త కుటుంబం లెక్కలలో చేర్చే ప్రశక్తి లేదని మంత్రి చెప్పారు.

పదివేలమంది రైతులకు అధికోత్పత్తి విత్తనాలు

శ్రీకాకుళంజిల్లా గిరిజన ప్రాంతాలలో ఉచితంగా సప్లయి: ప్రాజెక్టు ఆఫీసర్ వెల్లడి

శ్రీకాకుళం, ఆగస్టు 8—

ప్రస్తుతపు ఖరీఫ్ పంట కాలంలో శ్రీకాకుళం జిల్లాలో పదివేల మందికి అధికోత్పత్తి విత్తనాలను ఉచితంగా సప్లయి చేయడం జరిగిందని గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ సి. ఎస్. రావు చెప్పారు.

ఈ పథకంక్రింద ఈ సంవత్సరం, వచ్చే సంవత్సరం 1.5 కోట్లు వెచ్చించడం జరుగుతుందని ఆయన చెప్పారు. భూమిలను దాగుచేయడం, నీటి పారుదల, మత్స్య పరిశ్రమ భూసారాన్ని పెంపుదల, వ్యవసాయానికి సంబంధించిన పరిశ్రమలను పెంపొందించడం జరుగుతుంది.

ఈ పథకంవల్ల 40 వేల మంది లాభం పొందుతారని తెలుస్తున్నది.

ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు గత మే నెలలో ప్రారంభించారు.

రైతులకు గిరిజన కార్పొరేషన్ నుంచి ఋణ సహాయం చేస్తారు. వారు ఉత్పత్తి చేసినదాన్ని తిరిగి కొనుగోలు చేస్తారు. దీని వల్ల ఋణం తిరిగి వసూలు చేయడానికి సులభమవుతుంది. ఎరువులు కూడా అవసరమైనంత వరకు సహాయం చేస్తారు. రత్న జయవంటి వరి వంగడాలు రైతులలో బాగా వాడిలోకి వచ్చాయి.

గిరిజన రైతులకు పంచిపెట్టిన ఏడు వేల హెక్టార్లలో బాగునేత కార్యక్రమం కొనసాగుతున్నది. నాలుగు వందల హెక్టార్లు ఉచితంగా బాగుచేసి యిచ్చారు.

నాగార్జునసాగర్ వద్ద రిక్రెయిమెంట్ పొందిన 110 మంది ఇంజనీరింగ్ నిబ్బందిని ఈ పథకంలో చేర్చుకున్నారు. వీరు ఈ ప్రాజెక్టుక్రింద 25 మైనర్ ఇరిగేషన్ పథకాలతోపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తారు.

పాడిపరిశ్రమ పథకం క్రింద భద్రగిరి ప్రాంతంలో పశువులను సరఫరా చేశారు. ఈ పాలను అమ్మడానికి కూడా ఏర్పాట్లు చేశారు.

ఇటువంటి ప్రాజెక్టును రెండు సంవత్సరముల కంటె ఎక్కువ కాలానికి విస్తరింప చేయాలని శ్రీ సి. ఎస్. రావు అన్నారు.

ఆగస్టు 15 వ తేదీన రక్షణ దళాలకు సంబంధించి విడుదల కానున్న ప్రత్యేక తపాలా బిళ్ళ. త్రివిధ బలాలను తెలిపే రంగుల చారలు దీనిలో వుంటాయి.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రెస్ కౌన్సిల్ అభిశంసన

పి.టి.ఐ. ప్రచురించిన వార్త యథార్థం కాదని విచారణ

న్యూఢిల్లీ, ఆగస్టు 8—ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపైన, పి.టి.ఐ. వార్తా సంస్థపైన శ్రీ బంకా బెహారీదాస్ చేసిన పిర్యాదులను పురస్కరించుకొని జరిపిన విచారణ అనంతరం ప్రెస్ కౌన్సిల్ చేసిన నిర్ణయాలకు, ప్రకటనకు ఎట్టి సంబంధంలేదని పి.టి.ఐ. చేసిన వాదనను ప్రెస్ కౌన్సిల్ నిన్న ఖండించింది.

ప్రెస్ కౌన్సిల్ నిన్న సాయంత్రం విడుదలచేసిన పత్రికా ప్రకటనలో పై విధంగా పేర్కొన్నది.

హైదరాబాద్‌నుంచి తనవిలేకరి శ్రీ ఎస్. వి. హైదర్‌ను బొంబాయి బదిలీచేయడం పరిపాలనా కారణాల దృష్ట్యా జరిగినదేకాని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సంతృప్తిపరచడానికి కాదని శ్రీ కె. ఎస్. రామచంద్రన్ చేసిన వాదనను ప్రెస్ కౌన్సిల్ ఆమోదించినదని, అయితే ఆ విషయాన్ని ప్రెస్ కౌన్సిల్ ప్రకటనలో చేర్చలేదని పి. టి. ఐ. నిన్న ఉదయం ఒక ప్రకటనలో పేర్కొన్నది.

అయితే పి. టి. ఐ. ప్రకటన 'పూర్తిగా అబద్ధ'మని ప్రెస్ కౌన్సిల్ స్పష్టంచేసింది.

ప్రెస్ కౌన్సిల్ ఈ క్రింది నిర్ణయం గైకొన్నది: 1. తెలంగాణా ఆందోళనకు సంబంధించి పి. టి. ఐ. వార్తా సంస్థ వార్తలను గోరింతలు కొండంతలుగా ప్రచురించినదన్న ఆరోపణతో పి.టి. ఐ.పై పత్రికి తీసుకొనిరావడానికి చెలిమ్రింటర్ సర్వీసును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపసంహరించుకొన్నది.

2. రాష్ట్ర ప్రభుత్వం పత్రికికి లొంగి తన హైదరాబాద్ విలేకరిని శ్రీ హైదర్‌ను బొంబాయి బదిలీచేసినట్టు అనుమానించడానికి తగిన కారణాలున్నప్పటికీ, అందుకు తగిన సాక్ష్యం లేనందువల్ల ఆ విషయాన్ని రికార్డు చేయజాలము.

ముడి జనపనార ధర త్వరలో హెచ్చింపు

రాజ్యసభలో మంత్రి శ్రీ మిశ్రా సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 7—

ముడి జనపనార ధర ప్రస్తుతంవున్న క్వింటాల్ 115 రూపాయలు స్వల్పంగా హెచ్చించనున్నట్టు విదేశ వాణిజ్యం మంత్రి శ్రీ ఎల్.ఎన్. మిశ్రా రాజ్యసభలో చెప్పారు.

శ్రీ గుణానంద ఠాగూర్, శ్రీ కల్యాణ రాయ్ ప్రశ్నకు జవాబు చెబుతూ ఉత్పత్తి దారులకి ప్రోత్సాహకరమైన ధరలభించడం అవసరమని ఆయన చెప్పారు. కనీసధర హెచ్చింపుకు పశ్చిమ బెంగాల్, అస్సాం ప్రభుత్వాలు సిఫార్సు చేసినవని ఆయన చెప్పారు.

ఈ సంవత్సరం జనపనార ఉత్పత్తి 15 లక్షల బేళ్ళు మేరకు తగ్గవచ్చునని, 53 లక్షల బేళ్ళు ఉత్పత్తి కావచ్చునని శ్రీ మిశ్రా చెప్పారు.

ఉత్పత్తి దారులకు సంబంధించినంత వరకు మంచి ధరలే వుంటాయని ఆయన అన్నారు.

అస్సాం బాటన్‌రకం జనపనార ధర ప్రభుత్వం నిర్ణయించినది క్వింటాల్‌కు 115 రూపాయలుకాగా కలకత్తా స్పేచ్ఛా మార్కెట్టులో 160 రూపాయలు వున్నదని మంత్రి చెప్పారు.

వ్యవసాయ ధరల కమిషన్ సిఫార్సు ప్రాతిపదికపై జనపనార ధర క్వింటాల్‌కు 115 రూపాయలు చేశారు. రెండు నెలల తర్వాత ధరలను సమీక్షించ వలసి వచ్చిన దని శ్రీ మిశ్రా చెప్పారు.

దలారీలు లాభాలు పొందడం తనకు తెలుసునని, అందువల్ల ఉత్పత్తిదారు నుంచి నేరుగా జనపనార కార్పొరేషన్ కొనుగోలు చేసేట్టు చూస్తున్నామని మంత్రి చెప్పారు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం క్వింటాల్‌కు 137 రూపాయల వరకు హెచ్చు ధర నిర్ణయించినదని ఆయన చెప్పారు. కొత్త ధర నిర్ణయించే సందర్భంలో ఈ సూపనను దృష్టిలో పుంచుకొనగలమని ఆయన చెప్పారు. హెచ్చించే ధర పశ్చిమ బెంగాల్ సిఫార్సుచేసిన ధరకంటె హెచ్చుగా వుండవచ్చునని ఆయన చెప్పారు.

ప్రభుత్వం అధ్వర్యాన అమెరికా, బ్రిటన్, బెల్జియం సందర్శించి వచ్చిన జనపనార ప్రతినిధివర్గం, కార్పెటు స్పాకింగ్, హెసియన్ ధరలను తగ్గించాలని సూచించింది. సింథెటిక్స్ పోటీకి ఇది అవసరమని వారు సూచించినట్టు రాజ్యసభలో శ్రీ మిశ్రా చెప్పారు.

ధరలలో స్థిరీకరణ, ముడి జనపనార నిరాటంకంగా సప్లయి చేయడం అవసరమని ప్రతినిధివర్గం తమ సమగ్ర నివేదికలో సూచించినట్టు మంత్రి చెప్పారు.

ఆయన శ్రీ ముఖర్జీ, సీతారామకేసరి ప్రశ్నలకు జవాబుగా ఈ విషయాలు చెప్పారు.

పాలరాతి పలకలలో ప్రముఖుల జీవిత చిత్రణ

వివిధరోడ్లపై ఏర్పాటుకు ఢిల్లీ కార్పొరేషన్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 8— స్వాతంత్ర్య దినోత్సవం కార్యక్రమంలో భాగంగా ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ రాజధానిలోని రోడ్లలో మృతిచెందిన మహానాయకుల జీవిత పాలరాతి పలకలను ఏర్పాటు చేయదోతున్నది.

ఈ విషయాన్ని మేయర్ కె. ఎస్. సహాని మొన్న ఇక్కడ తెలియజేశారు. నెహ్రూ, మహాత్మా గాంధి, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, సుభాస్ చంద్రబోస్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, భగత్‌సింగ్, డాక్టర్ అంబేద్కర్ జీవితాలను తెలియజేసే పలకలను ఈ సంవత్సరం ఏర్పాటు చేస్తారు. ఆ పలకపై వారి ఫొటోతోపాటు, వారి జీవిత చరిత్ర, ఆయన సందేశం కూడా చెప్పుతారు.

హైదరాబాద్‌లో విదేశీ సిగరెట స్వాధీనం

హైదరాబాద్, ఆగస్టు 8 — నిన్న ఇక్కడ వెంగళ్ల ప్రాంతంలో కస్టమ్స్, సెంట్రల్ ఎక్సయిజ్ హైదరాబాద్ శాఖ అధికారులు ఒక కారునుంచి పదివేల రూపాయం విలువగల బ్రిటిష్ సిగరెట్లను స్వాధీనం చేసుకొన్నారు.

కారును కూడా జప్తుచేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ఆంధ్ర సంస్కృతి విశిష్టత

కలకత్తా సభలో ప్రస్తుతి

కలకత్తా, ఆగస్టు 8— జాతి ప్రగతికి దాని సభ్యతా సంస్కృతులే మూలాధారం. పరంపరాగతమయిన ఈ సభ్యతా సంస్కృతుల వల్లనే భారతదేశంలో ఆంధ్ర జాతి విశిష్టస్థానాన్ని అలంకరించినది." ప్రతి భారతీయుడు ఆంధ్రుల సంగీత, నృత్య, నాటకాలను అమితంగా గౌరవిస్తారు" అని కలకత్తా ఆంధ్ర సంఘం 35 వార్షికోత్సవం సభకు ప్రధాన అతిథిగా విచ్చేసిన ప్రముఖ వంగ దినపత్రిక 'జుగాంతర్' సంపాదకులు శ్రీ సుకమల్ కాంతిఘోష్ ఇటీవల అభిభాషించారు.

స్థానిక "ఆంధ్రహాల్"లో జరిగిన సభకు సంఘం ప్రెసిడెంటు శ్రీబుర్రా శివరామశాస్త్రి అధ్యక్షత వహించారు.

శ్రీ ఘోష్ తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఉత్తర, దక్షిణ ప్రాంతాల సంస్కృతులలో అనేక సామ్యాలు వున్నాయని, వంగీయులవలె ఆంధ్రులు కూడా నిస్వార్థ త్యాగ నిరతితో, చిత్తశుద్ధితో గురుతర బాధ్యతలను నిర్వహించడానికి సర్వదా సంసిద్ధులని చరిత్ర ఋజువు చేసినదని కొనియాడారు.

ఈ సందర్భంగా తెలుగు, ఆంగ్ల, హిందీ, బెంగాలీ విభాగాలతో ఆంధ్రసంఘం వెలువరించిన 19 వ వార్షిక సంచికను శ్రీ ఘోష్ ఆవిష్కరించారు.

సంఘం కార్యదర్శి శ్రీ పెట్టా ఆంజనేయులు తొలుత స్వాగతం పలికారు.

ప్రముఖ నర్తకి శ్రీమతి నీరదాపాల్ తమ బృందంతో భరతనాట్య ప్రదర్శన లిచ్చారు.

శ్రీ ఎ.కె.డి. ప్రసాద్ వందన సమర్పణంతో సభ ముగిసినది.

కర్నూలుపట్టణంలో ఈతకొలను

కర్నూలు, ఆగస్టు 8— జిల్లా కలెక్టరు శ్రీ టి. ఎస్. రాఘవేంద్రరావు ఇక్కడ ఈతకొలనుకు ప్రారంభోత్సవం చేశారు.

ఈ ఈతకొలను 1.15 లక్ష రూపాయలతో నిర్మించబడినట్టు క్రీడామండలి సభ్యుడు శ్రీరామమూర్తి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అదనంగా మరి 25 వేలు మంజూరు చేసిందని ఆయన చెప్పారు.

ఈతకొలనుకు కె. సి. కెనాల్ నుంచి నీటి సరఫరా జరుగుతుంది.

రాజమండ్రిలో టేబుల్ టెన్నిస్ పోటీలు

రాజమండ్రి, ఆగస్టు 8— స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా ఇక్కడ వీరేశలింగం టౌన్‌హాలులో టేబుల్ టెన్నిస్ పోటీలు జరుగుతాయి.

ఎంట్రీలను ఆగస్టు 12 తేదీవరకు పంపవచ్చునని పోటీలు నిర్వహిస్తున్న గౌతమి టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శి శ్రీ గోపి ప్రకటించారు.

తాడికొండలో క్రికెట్

తాడికొండ, ఆగస్టు 8— గుంటూరు జిల్లా తాడికొండలోనున్న క్రికెట్ అసోసియేషన్‌వారికి, స్థానిక సంస్కృత కళాశాల విద్యార్థులకు క్రికెట్ మ్యాచ్ ఎస్. వి. వి. హైస్కూల్ ఆవరణంలో శ్రీ టి. గుబ్బారెడ్డి అధ్వర్యాన జరిగింది. సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వి. రామకృష్ణ ఆటను ప్రారంభించారు.

స్కోరు వివరాలు: సి. ఎ. టి. 40;39 ఎస్. జి. కె. ఒ. సి. 32;39.

B. Com., B. A., అప్లికేషన్లు కోరబడుతున్నవి

వీరేశలింగం అస్తిక కళాశాల, రాజమండ్రి.

72—73 యీ సంవత్సరము B. A., B. Com., డిగ్రీ తరగతులు ప్రారంభించబడుతున్నవి. B. Com., & B.A., సీట్లు కావలసినవారు వెంటనే ప్రిన్సిపాల్ V. T. College వారికి రెండు రూపాయలు పంపించి అప్లికేషన్లు తెప్పించుకొనగోరుచున్నాము.

రాజమండ్రి. 7—8—72.

మేడూరి సత్యనారాయణ, Secretary and Correspondant

సంపూర్ణ ఆరోగ్యం పొందండి

శాస్త్రీయ పద్ధతిలో శస్త్ర చికిత్స లేకుండా పూర్తి ఆరోగ్యాన్ని పొందుటకు సెక్స్ స్పెషలిస్టును సంప్రతించండి. (22 సంవత్సరాలు అనుభవం. డా॥ రాయ్, గవర్నమెంట్ రిజిస్టర్డు) నీరసము, నరముల బలహీనత చికిత్సద్వారా నయంచేసుకొని మీ వైవాహిక జీవితాన్ని సుఖవంతం చేసుకోండి. నరముల బలహీనత మందులద్వారానే గాక ఎలక్ట్రిక్ చికిత్సవల్ల కూడా నయం చేయబడును. ఆంధ్రప్రదేశ్‌లో 1950 లో స్థాపించబడినది.

సంప్రదించువేళలు: ఉ॥ 8-00 నుండి 1-00గం. సా॥ 4-00నుండి రాత్రి 9-30 వరకు

రాయ్ మెడికల్ హాల్ బ్రాంచి ఆఫీసు మొదటి అంతస్థు గాంధీనగరం (అలంకార్ టాకీస్ ఎదుట) విజయవాడ-3 (పోను: 7465)

హెడ్ ఆఫీసు: మొదటి అంతస్థు, పెయింట్ వేర్ రోడ్, (మనోహర టాకీస్ వద్ద) సికింద్రాబాద్ (పోను: 72184)



ఎందుకంటే, తెగుళ్ళు, క్రిమికీటకాదులు మీ పంటను పాడుచేసి ఊహింపరాని నష్టం కలిగించే ముందే, మీ పంట రక్షణకు కావలసిన ముఖ్యావసరాలను థైమెట్ 10-జి సాధ్యం చేయగలదు గనుక.

థైమెట్ 10-జి క్రమమైన స్పర్శతో శత్రువరలగల అసాధారణ సంయోగ చర్యతో ఎంతో కాలం అవిచ్ఛిన్నంగా నిలవగలిగే శక్తివంతమైన క్రిమిద రక్షణ సమకూరుస్తుంది. అందువల్లే థైమెట్ 10-జి ఒక్కసారి చల్లితే చాలు, సామాన్య క్రిమిసంహారిణులు ఎన్నోసార్లు చల్లిన పరిణామాన్ని అందచేస్తుంది.

దాని సక్రమమైన చర్యవలన, థైమెట్ 10-జి గారిపాటు వలన మూడ్పురెండవ పరియు పరిపూర్ణంగా పెరిగిన మొక్కలకు ఏమాత్రం హానికలిగించదు. సుమారు 60 దేశాలలో ఫలితాలను సాధించిన థైమెట్ 10-జి ప్రతి వ్యవసాయదారుడు ఎదుర్కొనే తెగుళ్ళ సమస్యలకు మితవ్యయములో లభ్యమయే పరిష్కారం.

సయానమిడ్ ప్రపంచమంతటా వ్యవసాయ వ్యవస్థకు సాయపడుతోంది.

వ్యవసాయ విభాగం:
సయానమిడ్ ఇండియా లిమిటెడ్,
పి.బి. బాక్స్ నెం. 8109, బొంబాయి-25.

CYANAMID
ప్రపంచమంతా వ్యవసాయరంగానికి సేవచేస్తుంది

SISTA S CIL 383 TEL

ఆంధ్రప్రదేశ్‌కు డిస్ట్రిబ్యూటర్లు:

ఇన్‌ఫర్ ఏజెన్సీస్, 3—5—822, హైదర్‌గూడ, హైదరాబాద్—1.

రామమోహన్ ఎంటర్‌ప్రైజెస్, పోస్టుబాక్స్ నెం. 384, ఏలూరురోడ్, విజయవాడ-2

ఢిల్లీలో సినీనటుల ప్రదర్శన రద్దు

మద్రాసు, ఆగస్టు 8—భారత స్వాతంత్ర్య రజతోత్సవాల సందర్భంగా ఈ నెల 15 వ తేదీన న్యూఢిల్లీలో ఏర్పాటు చేయదానికి తలపెట్టిన "సినీ కళాకారుల ప్రదర్శన" రద్దు అయినట్టు అఖిలభారత సినీ నిర్మాతల మండలి అధ్యక్షుడు శ్రీ ఎ.ఎన్. శ్రీనివాసన్ ప్రకటించారు.

దేశంలో దుర్భిక్షం తాండవిస్తున్నందువల్ల ఆడంబరాలను రద్దు చేయవలసిందిగా ప్రధాని ఇందిర చేసిన విజ్ఞప్తిని పురస్కరించుకొని అలా నిర్ణయించినట్టు ఆయన అన్నారు.

రాష్ట్రంలో డెస్క్ కాల్క్యులేటర్స్

లఘు పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్ వెల్లడి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, ఆగస్టు 8— దేశంలో "డెస్క్ కాల్క్యులేటర్స్"నునిర్మించే మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవుతుంది. రెండు నెలలోగా ఈ పరికరాలు ఉత్పత్తి అవుతాయి.

ఆంధ్రప్రదేశ్ లఘు పరిశ్రమాభివృద్ధి సంస్థ. రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఇంజనీర్లు సంయుక్తంగా ఈ పరికరాలను ఉత్పత్తి చేస్తారు. ఆ ఇంజనీర్లు విదేశాలలో శిక్షణ పొందారు.

పరిశ్రమాభివృద్ధి సంస్థ ఛైర్మన్ శ్రీ మాధవరెడ్డి నిన్న ఒక ఇంటర్వ్యూలో ఈ విషయం ప్రకటించారు.

ప్రస్తుతం ఆ ఇద్దరు ఇంజనీర్లు విదేశాలలో వున్నారని అన్నారు.

ఆ ఇద్దరు ఇంజనీర్లు శ్రీ వి.వి. రామారావు, శ్రీ పి. నరసింహారెడ్డి అమెరికాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కంపెనీలలో పని చేశారు.

ఈ ఫ్యాక్టరీ స్థాపనకు 15 లక్షల రూపాయల పెట్టుబడి అవసరం. లఘుపరిశ్రమాభివృద్ధి సంస్థ రెండు లక్షల 50 వేలు, ఆ ఇద్దరు ఇంజనీర్లు కూడా రెండు లక్షల 50 వేలు. మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ఆర్థిక సహాయక సంస్థ బ్యాంకులు భరిస్తాయి.

సంవత్సరానికి 1200 పరికరాలను తయారుచేయడానికి భారత ప్రభుత్వం లైసెన్సు ఇచ్చిందని శ్రీ మాధవరెడ్డి తెలియజేశారు.

నాదారంలో నిర్మితమయ్యే ఈ కర్మాగారం మధ్యతరహాగా వుంటుందని అన్నారు.

నెల్కోకంపెనీ వారు ఒక ప్రొటోటైపు చూపించారని, అయితే దాని సైజు చాలా పెద్దదని, ధరకూడా 18 వేల రూపాయలని, కాని ఆంధ్రప్రదేశ్‌లో నిర్మితమయ్యే యంత్రం చాలా చిన్నది కాక ధరకూడా నాల్గువేలరూపాయలు మాత్రమేనని అన్నారు.

తెనాలిలో శ్రీమతి సుబ్బులక్ష్మి గానసభ

తెనాలి, ఆగస్టు 8—ఇక్కడి సీతారామ గానసభ రజతోత్సవాల సందర్భంలో ఆగస్టు 15 వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు గెయిటీ సినిమాహాలులో "పద్మవిభూషణ" శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి పాట కచేరీ ఏర్పాటు చేయబడిందని గానసభ ప్రధాన కార్యదర్శి శ్రీ టి. పి. శాస్త్రి తెలియజేస్తున్నారు.



మీ స్పెషల్ కాఫీ ఇప్పుడు ప్రత్యేకంగా అదనపు ప్యాకింగులో!



చిక్కనైన మంచి రుచి గల స్పెషల్ కాఫీ కొత్త అధిక స్ట్రాంగ్ రికరి—ప్రస్తుతం ప్రత్యేకంగా లాభకరమైన 400 గ్రాముల ప్యాకింగులో దొరుకుతుంది. ముఖ్యంగా కాఫీ సేవించే మీ కుటుంబం వంటి వారికోసమే! త్వరపడండి! కొత్త పెద్ద ప్యాకింగులో రికరిని కొని ఎక్కువ అదా చేయండి!

కొత్తది! అధికస్ట్రాంగ్ రికరి ఇన్‌స్టెంట్

ACIL-147-254-TEL

ప్రత్యేక రుచిలో ప్రత్యేక కాఫీ

Printed and Published by K.L.N. Prasad at Andhra Printers Ltd; Vijayawada-1
Editor : Narla Venkateswara Rao